# చాటింపు
CHATIMPU Telugu Daily

కరీంనగర్ సంపుటి: 19 సంచిక: 110 బుధవారం, ఫిబ్రవరి 11, 2026 ఎడిటర్ : యాతాకుల లింగయ్య పేజీలు: 12 వెల : రూ 1/-


అర్జున్ టెండూల్కర్
## వివాహం
కుటుంబంతో కలిసి ప్రధానిని ఆహ్వానించిన సచిన్



## పాక్ యూటర్న్..
భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు అంగీకారం



7



# నేడే పోలింగ్!
## నేడు మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్!

- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్
- భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసుల భద్రత
- మక్తల్ ఆరోవార్డు బిజెపి అభ్యర్థి ఆత్మహత్యతో ఎన్నిక వాయిదా



**హైదరాబాద్ (చాటింపు ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరుగ నున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే...నారాయణపేట్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆరోవార్డు ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ ఆత్మహత్యతో ఎన్నికను రద్దు చేస్తున్నట్టు తెలిపింది. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో తమకు కేటాయించిన బూతలకు చేరుకున్నారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ జరుగనున్నది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకానున్నది. సాయంత్రం 5 వరకు పోలింగ్

మిగతా 2 లో

## ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



- మూడు వేల అదనపు బలగాలతో ఎన్నికల బందోబస్తు
- పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్
- ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు
- డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడి

2

# స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం
## లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు కాంగ్రెస్ ఎంపీల నోటీసు






- యూఎస్ డీల్, నరవణె పుస్తకంపై చర్చకు అనుమతించలేదని ఆగ్రహం
- 118 మంది ఎంపీల సంతకాలు..దూరంగా టీఎంసీ
- తేలేవరకు రాను స్పీకర్ సంచలన నిర్ణయం
- లోక్‌సభ సెక్రటేరియట్ వర్గాల వెల్లడి
- ఆ రోజు విపక్ష మహిళా ఎంపీలు ట్రెజరీ బెంచ్ దాటి వచ్చారు
- ఫిబ్రవరి 4నాటి వీడియోను విడుదల చేసిన మంత్రి కిరణ్ రిజిజు

ఉభయ సభల్లో అధికార, ప్రతిపక్షాలకు మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. సభలో తమకు కనీసం మాట్లాడేందుకు అవకాశమివ్వడం లేదని లోక్సభ స్పీకర్ ఓం బిర్లా వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి పార్టీలు అవిశ్వాస తీర్మానం నోటీసును లోక్ సభ సెక్రటరీ, జనరలు అంద జేశాయి. ఆ నోటీసుపై వందమం దికి పైగా ఎంపీలు సంతకాలు చేశారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం, మాజీ ఆర్మీ చీఫ్ నరవడె పుస్తక వివాదంపై చర్చకు పట్టుబట్టిన తరుణంలో ప్రతిపక్షాలు స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మాన నిర్ణయం తీసుకోవడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకు న్నది.

పుస్తక వివాదంపై స్పందించిన
## మాజీ ఆర్మీ చీఫ్
పుస్తకం ఇంతవరకు పబ్లిష్ కాలేదని వెల్లడి

4




ఎన్నికలకు ఒకరోజు ముందు
# అనూహ్య ఘటన
## మక్తల్ ఆరోవార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య

- ఘటనకు కాంగ్రెస్ కారణమని మండిపడ్డ బీజేపీ...
- పార్లమెంటులో ప్రస్తావించిన కిషన్‌రెడ్డి, లక్ష్మణ్
- డీజీపీ ఆఫీస్ ముట్టడికి బిజెపి శ్రేణుల యత్నంతో ఉద్రిక్తత



3



## అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా

- చోద్యం చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- బాబుకు గురు దక్షిణ సమర్పిస్తున్నట్లుగా ఉంది
- మాజీమంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు

.. వివరాలు 2లో

తెలంగాణపై కేంద్రం
# ఆర్థిక వివక్ష



- నిధుల్లో కోత.. ఫెడరలిజంపై దాడే...
- సొమ్ములు మావి... గొప్పలు మీవా.?
- ప్రతిసారి మేమిచ్చాం, మేము తెచ్చాం కాదు అది తెలంగాణ ప్రజల సొమ్ము
- తెలంగాణ కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు...
- కేంద్ర పథకాలతో కలిపి ఇచ్చింది 51 వేల కోట్లు మాత్రమే.
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం

2

# ఇప్పుడ కెనడా వంతు వచ్చింది

## ఇరుదేశాల మధ్య వంతెనపై ట్రంప్ పేచీ

**వాషింగ్టన్,ఫిబ్రవరి10 :** కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెన ను బ్లాక్ చేస్తామని బెదిరించారు. 2014 లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ విమర్శించారు. వంతెన నిర్మాణానికి అయిన ఖర్చులో సగమైనా అమెరికాకు చెల్లించాలని, లేదా వంతెనపై ఇరుదేశాలకు సమాన యాజమాన్య హక్కులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కెనడాకు సూచించారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరుదేశాల మధ్య ఇటీవల తలెత్తిన విభేదాల గురించి ట్రంప్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తమ దేశం నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి కెనడా వసూలు చేస్తున్న సుంకాలు ఆమోదయోగ్యమైన రీతిలో లేవని ట్రంప్ మండిపడ్డారు. అమెరికాను కాదని చైనాతో వ్యాపారం చేసేందుకు ఆ దేశం మొగ్గు చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి వారు మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. వంతెన ప్రాజెక్టుకు సంబంధించిన వెబ్‌సైట్ ప్రకారం.. డెట్రాయిట్ నదిపై ఏర్పాటుచేసిన గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను కెనడియన్ ప్రభుత్వానికి చెందిన విండ్సర్-డెట్రాయిట్ బ్రిడ్జ్ అథారిటీ అనే సంస్థ నిర్మించింది. దీనికి అక్కడి ప్రభుత్వమే నిధులు సమకూర్చింది. ఈ ఏడాదిలో దీనిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు చేయడం గమనార్హం. అయితే ట్రంప్ ప్రకటనపై కెనడా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు

## యువత తీరుపై సజ్జన్నార్ హెచ్చరికలు

**హైదరాబాద్ :** బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న యువతకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. నగరంలో యువకులు బైక్‌పై చేస్తున్న ప్రమాదకర విన్యాసాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో సీపీ సజ్జన్నార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. వాహనాలను బాధ్యతాయుతంగా నడపాలని సూచించారు. బైక్ మీద చేసే ఈ చిత్రవిచిత్రమైన విన్యాసాలు చూడటానికి థ్రిల్లింగ్‌గా అనిపించవచ్చని.. కానీ అవి క్షణాల్లో ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడతాయని ఆయన హెచ్చరించారు. బైక్ మీద చేసే విన్యాసం.. నూరేళ్ల ఆయుష్షుకు వినాశనం అంటూ ఆయన పేర్కొన్నారు. చిన్న ప్రమాదం జరిగినా జీవితాంతం మంచానపడాల్సి వస్తుందని సీపీ అన్నారు. అంతేకాకుండా, మీ వల్ల ఇతరులు కూడా ప్రమాదాలబారిన పడొచ్చని తెలిపారు. సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం.. రోడ్డు మీద హీరోయిజం చూపించాలనే ఆశతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సజ్జనార్ సూచించారు. బైక్‌పై స్టంట్లు చేస్తూ వెనుక కూర్చున్న వ్యక్తుల ప్రాణాలను కూడా రిస్క్‌లో పెడుతున్న ఈ చర్యలు చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వాటి వల్ల కేసుల పాలై సమస్యలను కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. 'బాధ్యతగా డ్రైవ్ చేయండి' అంటూ సీపీ సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# మారుతీ కార్ల సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

## భారీగా దగ్ధమైన కార్లు... పెద్ద ఎత్తున నష్టం

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రముఖ కార్ల కంపెనీ సర్వీస్ సెంటర్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పలు కార్లు దగ్ధమయ్యాయి. రాజేంద్రనగర్ మారుతీ సుజుకీ సర్వీస్ సెంటర్‌లో ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భారీ అగ్ని ప్రమాదం కారణంగా పరిసరాల్లో దట్టమైన పొగ అలుముకుంది. ప్రమాదంలో పలు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పేశారు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని, రెండు ÷ర్ ఇంజిన్లతో మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో ఆ ఎ÷-లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి.

# మునిసిపల్ ఎన్నికలకు సర్వం సన్నద్ధం

మొదటి పేజీ తరువాయి

జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడికానున్నాయి.. ఆ రోజే నగర, పట్టణ ప్రజానీకం ఎవరి వైపు మొగ్గు చూపిందనే ఉతంఠకు తెరపడనున్నది. జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు మంగళవారం తరలించారు. ఎన్నికల సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన కేంద్రాలకు వాహనాల్లో వెళ్లారు. ఎన్నికలు జరిగే పురపాలికల్లో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులు, పత్రాలను పోలీస్ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి రాష్ట్రంలోని డిస్టిబ్యూష్రన్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు తరలించారు. అక్కడి నుంచి మంగళవారం ప్రతి పోలింగ్ కేంద్రానికి తరలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక



కేంద్రాలను గుర్తించి అకడ సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గు ర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. 11న జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోలింగ్ ప్రక్రియ కోసం సిబ్బంది నియామకం, వారికి అందించిన శిక్షణపై సమీక్షించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిజపి కూడా పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

## మూడు వేల అదనపు బలగాలతో ఎన్నికల బందోబస్తు

## పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్

## ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు

## డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బంది ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని చెప్పారు. ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను ఎన్నికల బందోబస్తు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లు భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో 1,183 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. 4,318 మందిని బైండోవర్ చేశాం. 398 నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాం. 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 55 చెక్‌పోస్టులు ఉన్నాయి. 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశాం. ఇప్పటివరకు రూ.3.09 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు కేసు నమోదు



చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం. మహాదేవప్ప ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసింది. అయితే విచారణలో వివరాలు తెలుస్తాయని అన్నారు. హైదరాబాద్ ఎఫ్ఎస్-ఎల్ ప్రమాదం ఎలా జరిగిందనేది విచారణ చేస్తున్నాం. ఏసీబీ కేసు 2015లో ఉన్న ఆధారాలు కోర్టుకు ఇచ్చాం. ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా అన్నీ పరిశీలించి నివేదికలు ఇచ్చాం. సాంకేతిక నిపుణులతో డేటాను రిట్రీవ్ చేస్తున్నాం అని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు కాలిపోయాయనే అనుమానాల నేపథ్యంలో, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం, కేసుల విచారణ ఏ దశలో ఉందనే విషయాలపై ఆయన స్పష్టతనిచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో ఎఫ్ఎస్ఎల్ లోని సర్వర్ రూమ్‌లు పూర్తిగా కాలిపోయాయని డీజీపీ వెల్లడించారు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ సర్వర్లకు ఎటువంటి బ్యాకప్ వ్యవస్థ అందుబాటులో లేదు. 'సర్వర్ రూమ్ పూర్తిగా దగ్ధమైంది. డేటా బ్యాకప్ లేకపోవడం వల్ల కొంత సమాచారం కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే, ప్రస్తుతం సాంకేతిక నిపుణుల బృందం రంగంలోకి దిగి, కాలిపోయిన సర్వర్ల నుండి డేటాను తిరిగి వెలికితీసే ప్రయత్నాలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కొన్ని కీలక కేసుల ఆధారాలు మాయమయ్యాయనే ప్రచారాన్ని డీజీపీ కొట్టిపారేశారు. ముఖ్యంగా 2015 నాటి ఏసీబీ కేసుల ఓటుకు నోటు వంటివి గురించి ప్రస్తావిస్తూ, ఆ కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను తాము 2021లోనే

కోర్టుకు సమర్పించామని స్పష్టం చేశారు. అందువల్ల ఇప్పుడు జరిగిన ప్రమాదానికి, ఆనాటి కేసుల ఆధారాలకు ఎటువంటి సంబంధం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా ఆయన స్పందించారు. ఈ కేసులో కావాల్సిన అన్ని అంశాలను ఇప్పటికే నిశితంగా పరిశీలించామని, దానికి సంబంధించిన నివేదికలను ఇప్పటికే సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు.

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

## నిధుల్లో కోత.. ఫెడరలిజంపై దాడే...

## సొమ్ములు మావి... గొప్పలు మీవా.?

## ప్రతిసారి మేమిచ్చాం, మేము తెచ్చాం కాదు

## అది తెలంగాణ ప్రజల సొమ్ము

### తెలంగాణ కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు...

### కేంద్ర పథకాలతో కలిపి ఇచ్చింది 51 వేల కోట్లు మాత్రమే.

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** కేంద్ర ఆర్థిక విధానాల వల్ల దేశానికి అధికంగా ఆదాయం సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదు, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. వికసిత్ భారత్ అనే నినాదం ఇస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని అన్నారు. 2018-19 నుంచి 2022-23 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మె-ంత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అయినప్పటికీ, ఈ స్థాయిలో ఆదాయం ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి వ్యాఖ్యానించారు. పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని మంత్రి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారిందని మంత్రి ఆరోపించారు. కేంద్రం చెప్పుకునే



వికసిత్ భారత్ విధానం అంటే ఇదేనా అని మంత్రి ప్రశ్నించారు. డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2024-25 లో తెలంగాణ రాష్ట్రం నుండి 1,33,208 కోట్ల పన్నులు వసూలు అయితే.. కేంద్రం నుండి రాష్ట్రానికి కేంద్ర పన్నుల రూపంలో 27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో 7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాల రూపంలో 16,762 కోట్లు మొ-ంత్తంగా 51,725 కోట్లు విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి సమాధానం చెప్పారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'పథకాల రూపంలో వచ్చిన నిధులను కూడా కలిపితేనే ఈ మొత్తం వస్తోంది. స్వేచ్ఛగా వినియోగించుకునే నిధులు మాత్రం మరింత తక్కువ' అని మంత్రి వివరించారు. జీఎస్టీ సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తెలిపారు. ఇక 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్యం÷-ర దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాలవారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెర పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇది కేవలం లెక్కల విషయం కాదు. ఇది కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితం. బలమైన రాష్ట్రాలను బలహీనపరచి, ఆర్థికంగా ఆధారపడేలా చేయాలనే ఉద్దేశమే కనిపిస్తోందని తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి పార్టీ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతోనే దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తాము అధికారంలో లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు విడుదల చేసి, వారి కుంచిత స్వభావాన్ని చూపెడుతున్నారని అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు భాగస్వాములే కాని, కేంద్రం దయాధర్మాలపై ఆధారపడేవి కావని మంత్రిగారు స్పష్టం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధించాలన్న, కేంద్రం చెప్పుకుంటున్న వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలని, ముఖ్యంగా ఆదాయం సమకూర్చే రాష్ట్రాలపై వివక్ష మానుకోవాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి కోరారు. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపీలు మరియు కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడు ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తెచ్చాం, ఇన్ని చేశాం, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందనట్లు మాట్లాడటం వారి పతనానికి నాంది. జాతీయ రహదారుల నిర్మాణాలను కూడా రాష్ట్రానికి విడుదల చేసే నిధుల ఖాతాలలో వేస్తున్న ఈ నాయకులు, వాటిని నిర్మించి మళ్లీ ప్రజల నుండే టోల్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్న విషయాన్ని మరిచారా అని మంత్రి ప్రశ్నించారు.

ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో భారీగా ఖర్చు చేస్తోందని, కానీ కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ యూనియన్ బ్జడెట్ లో చేర్చాల్సిందిగా చేసిన ప్రతిపాదనలలో ఒక్కటి కూడా మంజూరు చేయలేదని, ఇప్పటికైనా తెలంగాణను రాజకీయంగా శిక్షించే బ్జడెట్‌లు ఇక మానుకోని, ఫెడరలిజాన్ని గౌరవించి, తెలంగాణకు న్యాయమైన వాటా ఇవ్వాలని, లేకపోతే వికసిత్ భారత్ ఒక నినాదంగానే మిగిలిపోతుందని, నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి నాయకులు కూడా తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటాకోసం కేంద్రంతో పోరాడటానికి మాతో కలిసి రావాలని మంత్రి కోరారు.

# ఎన్నికలకు ఒకరోజు ముందు అనూహ్య ఘటన

## మక్తల్ ఆరోవార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య ఘటనకు కాంగ్రెస్ కారణమని మండిపడ్డ బీజేపీ...

## పార్లమెంటులో ప్రస్తావించిన కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

## డీజీపీ ఆఫీస్ ముట్టడికి బిజెపి శ్రేణుల యత్నంతో ఉద్రిక్తత





**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా ముగిసి..ఎన్నికలకు ఒకరోజు ముందు అనూహ్య ఘటన చోటుచేసుకుంది. నారాయణపేట జిల్లా మక్తల్ ఆరోవార్డు నుంచి పోటీ చేస్తున్న ఎరుకలి మహాదేవప్ ఆత్మహత్య సంచలనం కలిగించింది. ఇందుకు నిరసనగా బిజెపి భగ్గుమంది. ప్రత్యర్థుల వేధింపుల వల్లనే మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించింది. సిఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ కిడ్నాప్‌లకు, బెదరింపులకు పాల్పడిందని ఆరోపిస్తూ...నిరసనగా హైదరాబాద్ డీజీపీ కార్యాలయ ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చింది. దీంతో లక్డీకపూల్ లోని డీజీపీ కార్యాలయం ముందు భారీగా పోలీసులు భారీగా మోహరించారు. ఇకపోతే లోక్‌సభలో కిషన్ రెడ్డి, రాజ్యసభలో డాక్టర్ లక్ష్మణ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. సిఎం రేవంత్ రెడ్డి బెదరింపులకు పాల్పడుతున్నారని, ప్రత్యర్థులు భయంతో వణికేలా చేస్తున్నారని రాజ్యసభలో లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని లోక్‌సభలో కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇక హైదరాబాద్‌లో డిజిపి ఆఫీస్ ముందు బిజెపి ఆందోళనకు దిగింది. మహదేవప్ప మృతితో బిజెపి శ్రేణులు భారీగా తరలివచ్చి డీజీపీ ఆఫీసు దగ్గర ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ డీజీపీ ఆఫీసు ముట్టడికి యత్నించింది. దీంతో లక్డీకపూల్ లోని డీజీపీ ఆఫీసు దగ్గరకు బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. డీజీపీ కార్యాలయంలోకి చొచ్చుకుని వెళ్లేందుకు యత్నించారు. బారికేడ్లు దూకేందుకు యత్నించారు.దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పలువురు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వాహనాల్లో తరలించారు. పలవురిని అరెస్ట్ చేశారు. ÷ాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరగనుండగా.. మక్తల్ మున్సిపాలిటీలో 6 వార్డ్ బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహాదేవప్ప ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.. మహదేవప్ప మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రత్యర్థుల వేధింపులతోనే మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందని డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు.

## మహదేవప్ప మృతి అత్యంత బాధాకరం

### మంత్రి బెదిరంపులే కారణమన్న రామచంద్ర రావు

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య ఘటన తీవ్రంగా కలచివేసిందని బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఇది అత్యంత భాధాకరమని.. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. మహదేవప్ప ఆత్మహత్యకు కాంగ్రెస్ అహంకారపూరిత రాజకీయాలు, మాఫియా బెదిరింపులే కారణంగా తెలుస్తోందన్నారు. స్థానిక మంత్రి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపులు తట్టుకోలేకే భాజపా అభ్యర్థి బలవన్మరణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. అధికార మత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోంది. అహంకారపూరిత రాజకీయ నాయకుడి వేధింపులకు నిండు ప్రాణం బలైంది. ఈ ఘటనకు కారణమైన మంత్రి శ్రీహరిని తక్షణమే అరెస్ట్ చేయాలి. ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలి. ఈ ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ జరపాలి. లేనిపక్షంలో భాజపా కార్యకర్తల ఆగ్రహ జ్వాలలకు గురికాక తప్పదు. దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదు. మహదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం చేస్తుంది' అని రామచందర్‌రావు అన్నారు.

### మహదేవప్ప ఆత్మహత్యపై విచారణ చేయాలి

### కుటుంబ సభ్యులకు బిజెపి నేతల పరామర్శ

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకొవడం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహదేవప్ప కుటుంబానికి ప్రగాఢ సాన-ుభూతి తెలియజేశారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపి డికె అరుణతో కలసి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయించాలన్నారు. ఆత్మహత్యకు వేధింపులే కారణమని అన్నారు. ఇదిలావుంటే మహదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని ఎంపి డికె అరుణ మండిపడ్డారు. 'ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. మహదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షాంచాలని ఆమె డిమాండ్ చేశారు.

## అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా

### చోద్యం చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

### బాబుకు గురు దక్షిణ సమర్పిస్తున్నట్లుగా ఉంది

### మాజీమంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** కృష్ణా నదీ జలాలను ఏపీ అప్పనంగా తీసుకుపోతున్నదని..సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చోని చోద్యం చూస్తున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. తాను పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు అన్నారు. ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతున్నది. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కేఆర్ఎంబీకి రాసిన లేఖ ఇది. దీని ప్రకారం 664 టిఎంసీలు అంటే 80శాతం నీళ్లు ఏపీ వాడుకున్నది. ఇంతగా ఏపీ వినియోగిస్తుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నడని హరీష్ రావు ప్రశ్నించారు. 28 జనవరి నాడు తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం దాటి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీలు వాడుకున్నదని హరీష్ రావు తెలిపారు. ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుంది అని కేఆర్ఎంబీకి లేఖ రాసింది.వెంటనే బోర్డు మీటింగ్ పెట్టండి, ఏపీ నీటి దోపిడిని ఆపండి అని ఈఎన్సీ రాసిన లేఖలో ఉంది. 28న లేఖ రాసిండు, 31న ఈఎన్సీ రిటైర్ అయ్యారు.ఈఎన్సీ రిటైర్ అయిన తర్వాత వారం రోజుల దాకా పోస్టు నింపలేదు.లెక్కకు మించి నీళ్లు తీసుకుపోతుంటే మనకు ఈఎన్సీ పోస్టు నింపలేదు.వారం రోజుల తర్వాత మీడియా ప్రశ్నిస్తే పోస్టు నింపింది.బోర్డు మెంబర్ ఆయన. ఖాళీ పోస్టు ఎందుకు పెట్టారు.వాటా కుదరలేదా..? మాట కుదరలేదా.. ? వారం రోజులు ఎందుకు ఖాళీగా ఉంచారు.. రాష్ట్ర ప్రయోజనాలు ఈ ప్రభుత్వానికి పట్టదా.. ? అని హరీష్ రావు ప్రశ్నించారు.



రేవంత్‌కు గురువు గారు ఉన్నరని భయం. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్ల తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం కండ్లు మూసుకు ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. వేసవి వస్తున్నది, తెలంగాణకు నీటి అవసరాలు ఉన్నయి. పంటలకు, పారిశ్రామిక అవసరాలు ఉన్నాయన్నారు. తెలంగాణ అవసరాలు పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా..? తాత్కాలికంగా అయినా మనం 34శాతం వినియోగించుకోవాలి కానీ వినియోగించుకున్నది 20 శాతం వాటా. మన రాష్ట్రానికి 174 టీఎంసీలు వాడుకునేది ఉన్నది. అయినా వినియోగించుకోరు. ఈ రోజుకు కూడా ఏపీ 1.5 టీఎంసీల నీళ్లు తీసుకుపోతున్నది. మన పంటలు ఏం కావాలె. మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏం కావాలి. సర్కారు నడుపుతున్నరా..? సర్కస్ నడుపుతున్నరా..? అని ధ్వజమెత్తారు. అడగాల్సిన రేవంత్ రెడ్డి అడగడు, హక్కులు కాపాడాల్సిన కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించదు. బీజేపీ ప్రభుత్వం చేతిలో కేఆర్ఎంబీ ఉన్నది. రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్ మీద పడి ఏడ్వడం తప్పిదే..నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడరు..? కేఆర్ఎంబీని ఎందుకు నిలదీయరన్నారు. అడ్డగోలుగా ఏపీకి నీళ్లు తరలిస్తూ తెలంగాణ రైతుల నోళ్లు కొడుతున్నరు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం ఏమిటి..? రేవంత్, కిషన్ రెడ్డి కలిసి తెలంగాణ గొంతు పిసుకుతారా..? చంద్రబాబు, రేవంత్ మధ్య ఫెవికాల్ బంధం ఉండొచ్చు కానీ రాష్ట్ర హక్కులను ఆంధ్రాకు ఎందుకు రాసిస్తున్నరని ప్రశ్నించిన హరీష్ రావు. బీజేపీ, కాంగ్రెస్ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే స్పందించి ఏపీ నీళ్ల తరలింపును అడ్డుకోవాలని, క్యారీ ఫార్వర్డ్ విధానంలో పైనున్న శ్రీశైలంలో నీటిని ఆపి పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## బీఆర్ఎస్ నేతలు ట్యాపింగ్ ఆపలేదు!

### పాత అలవాటును వారు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు

### విదేశాల నుంచి తెచ్చిన పరికరాలు దాచిపెట్టి ట్యాపింగ్

### అవి ఏ ఫాంహౌస్‌లలో ఉన్నా గుర్తిస్తాం.. వారిని శిక్షిస్తాం

### ఓటు వేయమని ఉద్యోగులను అడిగితే తప్పేంటి?

### పురపాలికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కడతారు

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం, ఫిబ్రవరి 10 :** రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతలు ఇంకా ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడుతూనే ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు వాడుతున్న పరికరాలు ఏ తోటల్లో, ఫాంహౌసల్లో ఉన్నా గుర్తించి, బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. మంగళవారం ఆయన ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు వద్దిరాజు రవిచంద్ర, తాతా మధుసూదన్, కందాళ ఉపేందర్‌రెడ్డి తదితరులు తనపై చేసిన ఆరోపణల మీద మంత్రి పొంగులేటి ఘాటుగా స్పందించారు. బీఆర్ఎసను ఓడించేందుకు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ టెలీకాన్ఫరెన్సులు పెట్టారని, తాము దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని పేర్కొనడాన్ని ఖండించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్ చేసి ఇతరుల సమాచారాన్ని తెలుసుకున్న అలవాటును ఇంకా వదిలిపెట్టలేదన్నారు. విదేశాల నుంచి తెచ్చిన పరికరాలు దాచిపెట్టి ఇంకా వినియోగిస్తున్నారని, వాటితో ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వాటిని ఎక్కడ అమర్చినా పట్టుకొని తీరతామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉద్యోగులు కూడా ఓటర్లేనని, ప్రభుత్వం వారిని ఓటు అడగడం సహజమని చెప్పారు. తన నియోజకవర్గంలోని ఏదులాపురం మునిసిపాలిటీలో ఉద్యోగుల కుటుంబాలు కూడా నివసిస్తున్నాయని, వారిని ఓటు వేయాలని కోరితే.. దాన్ని కూడా బీఆర్ఎస్ నేతలు ట్యాప్ చేశారని ఆరోపించారు. ఉద్యోగులతో మాట్లాడిన విషయాలు ఎలా బయటకు వచ్చాయనేదానిపై దర్యాప్తు జరిపిస్తామన్నారు. ఉద్యోగులతో మాట్లాడిన మాటలను ఎలా విన్నారనేదానిపై విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులను బెదిరించి ఎన్నికల్లో వినియోగించుకున్నారని.. తాము అలా చేయలేదని, ప్రజాస్వామ్యబద్ధంగానే ఓటు అడిగామని చెప్పారు. రాష్ట్రంలో మునిసిపాలిటీ ఎన్నికల్లో 80 శాతం పైగా కాంగ్రెస్ అభ్యర్థులు గెలుస్తారన్నారు. పంచాయతీ ఎన్నికల తరహాలోనే పురపాలికల్లోనూ ఓటర్లు కాంగట్రెస్‌కు పట్టం కడతారని తెలిపారు. బుధవారం జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని, ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ ఎన్నికల్లో సీపీఐ స్నేహపూర్వక పోటీ మాత్రమే చేసిందని తెలిపారు.

## సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం

### హరీష్, రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో

### మరోమారు విమర్శలు గుప్పించిన కవిత

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** కేవలం సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం ఏమిటని, హరీష్ రావు, సిఎం రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ బూతుల వర్షం ఆగిపోవడం సంతోషంగా ఉందని కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చూశాక.. పార్టీ గుర్తులు లేకుండా ఎన్నికలు జరిగితే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మంచినీరు, పారిశుధ్యం లోపిస్తోందని, ఈ అంశాలపై ఎన్నికల ప్రచారంలో చర్చ జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. కేవలం సిద్ధిపేట మున్సిపాలిటీకి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయని.. హరీష్ రావు, ముఖ్యమంత్రికి మధ్య ఏముందో అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ చేయలేదని వెల్లడించారు. రుణమాఫీపై చర్చకు తాము సిద్ధమని.. సచివాలయాలనికి రమ్మంటారా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు రమ్మంటారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు జాగృతి తరపున వినతి పత్రం అందిస్తామని కవిత తెలిపారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా 12వ తేదీన బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎంఐఎం పార్టీ పొద్దు తిరుగుడు పువ్వులా.. ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట ఉంటుందని సెటైర్లు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాయల తెలంగాణకు ఒవైసీ బ్రదర్స్ మద్దతు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ మనిషి అన్న ఒవైసీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేశారని కవిత విమర్శించారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఆపడం సరికాదు

### వారికి బకాయిలు వెంటనే చెల్లించండి

### సీఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** రిటైర్డ్ ఉద్యోగులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. 'సీఎం గారూ... మీకు మానవత్వం ఉందా?' అని ప్రశ్నించారు. విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. రిటైర్డ్ అయ్యి రెండేళ్లయినా.. వారి బకాయిలను ఇంకా చెల్లించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 61 మంది విశ్రాంత ఉద్యోగులు తనువు చాలించారని.. వారి చావులకు ఎవరు బాధ్యులని లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులను రాష్ట్ర సర్కార్ ప్రాధాన్యం లేని కేటగిరీలుగా భావిస్తోందా అని బండి సంజయ్ నిలదీశారు. ప్రభుత్వ తీరు తెలంగాణకు మాయని మచ్చ అని విమర్శించారు. జీవితం మలి సంధ్యలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిదన్నారు. ముక్కూమొహం తెలియని వృద్ధులు కష్టాల్లో ఉంటేనే చేతనైనంత సాయం చేయాలని భావించే గొప్ప మానవతా హృదయం ఉన్న తెలంగాణ సమాజం మనదని ఆయన చెప్పుకొచ్చారు.ఉద్యోగ విరమణ చేసిన వెంటనే వారికి బెనిఫిట్స్ అన్నింటినీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని కేంద్ర మంత్రి ÷ర్ అయ్యారు. దీనిని తక్షణమే అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేసేందుకు వెనకాడబోమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

సంపాదకీయం

# ఎన్నికలంటే.... డబ్బున్నోళ్ల దందా !



ఎన్నికల్లో ప్రలోభాల పర్వంతో తెలంగాణ పల్లెల నుంచి పట్టణాల దాకా మత్తులో జోగుతున్నాయి. మొన్నటి కి మొన్న పంచాయితీ పోరు ముగిసింది. ఇప్పుడు పట్టణపోరు జరుగుతోంది. డబ్బున్న అభ్యర్థలదే హవా. డబ్బులు లేని అభ్యర్థులను ప్రజలు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. అతను ఎందుకు ఖర్చు పెడుతున్నాడో అర్థం చేసుకోవడం లేదు. ఎందుకు ప్రలోభ పెడుతున్నాడో గ్రహించడం లేదు. ఇప్పుడు పెట్టిన డబ్బు రేపు ప్రతి చిన్న పనికీ ముక్కుపిండి వసూలు చేస్తాడని గుర్తించడం లేదు. ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నాయకులకన్నా ప్రజలకు ఎక్కువ సంతోషంగా ఉంది. పండగ చేసుకుంటున్నారు. ఇంట్లో వంటావార్పులు అంతంత మాత్రమే. రోజుకు ఎవరో ఒకరు రావడం సాయంత్రానికి దావత్ ఇవ్వడం పరిపాటిగా మారింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గత వారం రోజులుగా ఇదే తంతు సాగింది. చివరకు బుధవారం ఎన్నికలు ఉండగా సాయంత్రం కూడా దావత్‌లకు టైమ్ కేటాయించారు. తాగుడు అలవాటు ఉన్నవారికి తాగినంత...తిండి అలవాటున్న వారికి తిన్నంత అన్న లెక్కన సాగడం ప్రజాస్వామ్య పరిహాసాని కి ఎన్నికలు పరాకాష్టగా నిలుస్తున్నాయి. సోమవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ప్రలోభాలకు తెర లేచింది. మద్యం, మాంసంతో పాటు ఇతరత్రా కానుకల పంపిణీ ప్రారంభమైంది. పది రోజుల పాటు హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. ఆ వెంటనే కొందరు అభ్యర్థులు ఓటర్లపై తాయిలాలు వెదజల్లడం ప్రారంభించారు. కొన్నిచోట్ల ఓ పార్టీ నేతలు ఇంటింటికీ చికెన్ పొట్లాలు పంపించారు. మరో అభ్యర్థి తన వార్డు పరిధిలోని ఓటర్లకు హారతి ప్లళెం పంపిణీ చేసారు. నామినేషన్ల పర్వం ముగిసిన వెంటనే ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. దాదాపు పది రోజుల పాటు ప్రచారంతో హోరెత్తించాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. పట్టణాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం చేశారు. వందల మందిని వెంటేసుకుని గల్లీగల్లీ చుట్టేశారు. పార్టీల నేతలు వార్డుల వారీగా బాధ్యతలు పంచుకుని ఇంటింటికీ తిరిగారు. ప్రచార పర్వం ముగియడంతో అన్ని పార్టీల నేతలు ప్రలోభాలకు తెర లేపారు. ఉదయమే పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో విచ్చలవిడిగా తాయిలాలు వెదజల్లాయి. చికెన్ వద్దు అన్నవారికి అరకిలో మటన్‌ను పంపించారు. గత రెండ్రోజులుగా మద్యం సీసాలు, కూల్‌డ్రింక్‌లు సరఫరా చేశారు. వీటికి అదనంగా రాత్రిపూట డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు ప్రజలు చెవులు కొరుక్కున్నారు. ఒక్కో ఓటుకు రూ.1500 నుంచి రూ.3 వేలు ఇచ్చినట్లు సమాచారం. కొన్ని పట్టణాల్లో ఖరీదు కూడా పెంచారు. డివిజన్లు, వార్డుల్లో మద్యం ఏరులై పారుతుండగా, మరోపక్క డబ్బుల పంపకాలు జోరందుకున్నాయి. ఇక, ప్రత్యర్థి ఎంత పంచుతున్నాడు.. అని అంచనా వేస్తూ అంతకుమించి ఓటర్లను ఇవ్వటానికి ఎత్తులు వేయడంలో అభ్యర్థులు తలమునకల య్యారు. ఇలా యథేచ్ఛగా పంపకాలు జరుగుతున్నప్పటికీ అధికారుల దృష్టిలో మాత్రం పడలేదు. అయితే పరస్పరం ఆయా పార్టీల వారు మా÷-తరం ఆరోపణలు చేసుకున్నారు. ఫలానా పార్టీవారు డబ్బులు పంచుతున్నారంటూ నిందలు వేసారు. స్థానిక నేతల అండతో విచ్చలవిడిగా మద్యం, డబ్బులను పంపిణీ చేస్తుంటే, పోలీసులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ఒక ఎత్తయితే...ప్రత్యర్థి పార్టీల్లో నాయకులకు డబ్బు, మద్యం ఎరగా వేసి ఎన్నికల్లో గెలుపుకోసం మార్గాలు తయారు చేసుకుంటున్నారు. కోవర్టులను ఏర్పాట్లు చేసుకుని వారి ఎత్తులను చిత్తు చేయడానికి అభ్యర్థులు డబ్బులు ఆశ చూపుతు న్నారని సమాచారం. ప్రత్యర్థి అభ్యర్థితో ఉండే ముఖ్యమైన నాయకులు పార్టీ మారకున్నా సమాచారం చేరవేసి వారి ఓటమికి కృషి చేసే వారికి రూ. 50000 నుంచి రూ.లక్ష వరకు ముట్ట చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఓటర్లనే కాకుండా ప్రత్యర్థి పార్టీల నాయకులను కూడా ప్రలోభాలకు గురి చేసి పార్టీలు మారడానికి వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది. మొత్తంగా మునిసిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగించారు. వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గెలుపు టెన్షన్‌తో పాటు చైర్మన్ సీటు దక్కుతుందా అనే ఉత్కంఠలో ఉన్నారు. ప్రధాన పార్టీలు చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల ప్రచారంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో పురపాలికల్లో చైర్మన్ సీటుపై ఆశతో ఆశావహులు భారీగా ఖర్చు పెట్టారు. తన గెలుపుతో పాటు తన పార్టీకి చెందిన వార్డు సభ్యుల గెలుపుకు కూడా వారి భుజస్కంధాలపై వేసుకున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా ఆశావహులు అన్నితామై వ్యవహరించారు. అయితే ఇన్నీ చేసిన చివరికి పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయా..? తానే పార్టీ అభ్యర్థిని అవుతానా అనే టెన్షన్‌లో ఆశావహులు ఉన్నారు. ఏదిఏమైనా ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎత్తులు, పైఎత్తులు పూర్తయ్యాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారాఓ చూడాలి. గత సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని ఓటేయలేదని నిలదీసారు. తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని నడిబజారులు పసుపుబయ్యింతో తిరిగారు. ఈ ఎన్నికల్లో అలాంటి విచిత్రాలు ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందో. ఓటర్ల మనసు ఎలా ఉం టుందో వేచి చూడాలి.




# స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం

**లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు కాంగ్రెస్ ఎంపీల నోటీసు**

**యూఎస్ డీల్, నరవణె పుస్తకంపై చర్చకు అనుమతించలేదని ఆగ్రహం**

**118 మంది ఎంపీల సంతకాలు.. దూరంగా టీఎంసీ**

**తేలేవరకు రాను**

**స్పీకర్ సంచలన నిర్ణయం**

**లోక్‌సభ సెక్రటేరియట్ వర్గాల వెల్లడి**

**ఆ రోజు విపక్ష మహిళా ఎంపీలు ట్రెజరీ బెంచ్ దాటి వచ్చారు**

**ఫిబ్రవరి 4నాటి వీడియోను విడుదల చేసిన మంత్రి కిరణ్ రిజిజు**



**న్యూఢిల్లీ:** ఉభయ సభల్లో అధికార, ప్రతిపక్షాలకు మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. సభలో తమకు కనీసం మాట్లాడేందుకు అవకాశమివ్వడం లేదని లోక్సభ స్పీకర్ ఓం బిర్లా వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి పార్టీలు అవిశ్వాస తీర్మానం నోటీసును లోక్ సభ సెక్రటరీ, జనరలు అంద జేశాయి. ఆ నోటీసుపై వందమం దికి పైగా ఎంపీలు సంతకాలు చేశారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం, మాజీ ఆర్మీ చీఫ్ నరవడె పుస్తక వివాదంపై చర్చకు పట్టుబట్టిన తరుణంలో ప్రతిపక్షాలు స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మాన నిర్ణయం తీసుకోవడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకు న్నది. లోక్సభ స్పీకర్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్.. స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చింది. ఈ మేరకు ప్రతిపక్ష నాయకులు కె సురేష్, మహ్మద్ జావేద్ మంగళవారం లోక్సభ సెక్రటరీ జనరలక్కు అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేశారు. అవిశ్వాస తీర్మానం నోటీసుపై 118 మంది ఎంపీలు సంతకం చేసినట్లు ఇండియా కూటమి వర్గాలు వెల్లడించాయి. అయితే, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఈ చర్యకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అవిశ్వాస తీర్మానం నోటీసుపై టీఎంసీ ఎంపీలు సంతకాలు చేయలేదని టీఎంసీ వర్గాల సమాచారం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94 సీ కింద అవిశ్వాస నోటీస్ అందించినట్లు కాంగ్రెస్ ఎంపీ, లోక్సభ ఉప ప్రతిపక్ష నేత గౌరవ్ గొగోయ్ మీడియాకు వెల్లడించారు.

**ఆర్టికల్ 94సీ ప్రకారం నోటీసు**

లోక్‌సభ స్పీకర్పై అవిశ్వాసానికి సంబంధించి ఆర్టికల్ 94 సీ ప్రకారం 14 రోజుల ముందు నోటీసులు జారీ చేసే వీలుంటు ంది. దీనికి సంబంధించి డ్రాఫ్ట్ ప్రతిని ఇప్పటికే సిద్ధం చేయగా.. మొత్తం 118 మంది ఎంపీలు సంతకాలు చేశారు. స్పీకర్పై అవిశ్వాసానికి ప్రధాన కారణంగా సభలో ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించకపోవడమేనని ఎంపీలంతా ముక్తకంఠంతో చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. రాహుల్ గాంధీకి మైక్ ఇవ్వకపోవడం, పార్టీకి చెందిన 8 మంది ఎంపీల సస్పెన్షన్ అంశాలపై పట్టుబడుతోంది. అలాగే, ప్రధానిమోడీపై ప్రతిపక్ష ఎంపీలు దాడికి ప్రయత్నించారంటూ స్పీకర్ నిరాధార ఆరోప ణలు చేశార ని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. లోకసభ పక్షనేత రాహుల్ గాంధీకి సభలో మాట్లా డే అవకాశమివ్వక పోవడం, ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్, స్పీకర్ ఓం బిర్లా పూర్తిగా పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగో పాల్ ఆరోపించారు. కాగా, ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మాన నోటీసుపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ స్పీకర్ తీర్మానంపై ఓటింగ్ నిర్వహిం చినా.. ప్రతిపక్షాల వద్ద సరిపడా సంఖ్యా జలం లేకపోవడంతో తీర్మానం వీగిపోతుందని అధికార పక్షాలు చెబుతున్నాయి.

## అవిశ్వాసం తేలే వరకు సభకు రాను

**ఈ చైర్లో కూర్చోను : స్పీకర్ ఓం బిర్లా సంచలన నిర్ణయం**

**న్యూఢిల్లీ:** లోక్సభ స్పీకర్ ఓం బిర్లా సంచలన నిర్ణయం తీసుకున్నారు. తనపై వచ్చిన అవిశ్వాస తీర్మానంపై సభలో చర్చించి ఫలితం తేల్చేంత వరకు స్పీకర్ కుర్చీలో కూర్చోకూ డదని లోక్సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయించు కున్నారు. ఈ విషయాన్ని లోక్సభ సెక్రటేరియట్ వర్గాలు బుధవారం తెలిపాయి. స్పీకర్ నైతిక వైఖరిగా పేర్కొంటున్న ఈ చర్యను ప్రతిపక్షాలకు సందేశంగా అందించారని, చైర్మన్పై అవిశ్వా సాన్ని వ్యక్తం చేసే ఏదైనా నోటీసును వెంటనే పరిష్కరించి ముగించాలని స్పీకర్ భావిస్తున్నా రని లోక్సభ వర్గాల సమాచారం. స్పీకర్ కార్యాలయంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన తర్వాత ఆ విషయాన్ని సభ అధికారికంగా పరిష్కరిం చుకోవడం సముచితమనే అభిప్రా యాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తుందని లోక్సభ సెక్రటేరియట్ వర్గాలు తెలి పాయి. మంగళవారం తనను కలిసిన పలువురికి తన భావాలను ఆయన స్పష్టంగా తెలియజేసినట్లు తెలుస్తోం ది. మార్చి 9 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల రెండవ భాగం మొదటి రోజున అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఓం బిర్లాను స్పీకర్ పదవి నుంచి తొల గించేలా తీర్మానం ప్రవేశ పెట్టేందుకు అవకాశం ఇవ్వాల ని విపక్షాలకు చెందిన 118 మంది ఎంపీలు లోక్ సభ సెక్రటరీ జనరల్ కు నోటీసు ఇచ్చారు. అవిశ్వాస తీర్మా నంపై చర్చ పూ-ర్తయ్యేంత వరకు సభకు దూరంగా ఉండాలని స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**అవిశ్వాసాలు కథ కంచికేనా..**

గతంలో కూడా లోక్‌సభ స్పీకర్పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపె ట్టి తొలగించడానికి ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి ఏవీ విజ యవంతం కాలేదు. స్పీకర్ తొలగింపు తీర్మానాన్ని ప్రతిపాదిం చడానికి కనీసం ఇద్దరు లోక్సభ సభ్యులు నోటీ సుపై సంతకం చేయాల్సి ఉంటుంది. ఎంత మంది సభ్యులైనా నోటీసుపై సంత కం చేయవచ్చు. సాధారణ మెజారిటీ ద్వారా సభ ఆమోదించిన తీర్మానం ద్వారా స్పీకర్ను పదవి నుంచి తొలగిం చవచ్చు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94 సీ లో నిబంధనలు ఉన్నాయి. సభలోని సభ్యులందరి సంఖ్యను లెక్కించడం ద్వారా మెజారిటీని లెక్కించడం జరుగుతుం దని.. హాజరై ఓటు వేసే సభ్యుల సంఖ్య కాదని లోక్సభమాజీ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచార్య తెలిపారు. పరువు నష్టం కలిగించే భాష లేదా కంటెంట్ ప్రతిపాదిత తీర్మానంలో లేదన్న విషయాన్ని డిప్యూటీ స్పీకర్ పరిశీలిస్తారు. అయితే, ప్రస్తుత లోక్సభకు డిప్యూటీ స్పీకర్ లేకపోవడంతో ఇచ్చిన కాంగ్రెస్ ఎంపిలు చైర్పర్సన్ల ప్యానెల్లో లోని అత్యంత సీనియర్ సభ్యుడు దీనిని పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రక్రియ ముగిసిన 'తర్వాత తీర్మానం సభకు చేరుతుంది. అప్పుడు ప్యానెల్ స్పీకర్ తీర్మానానికి అనుకూలంగా ఉ న్న సభ్యులను లేచి నిలబడమని అడుగుతారు. 50 మంది సభ్యులు దానికి మద్దతుగా నిలబడితే, ప్రమాణాలు నెరవేరితే, సభ అనుమతి మంజూరు చేసినట్లు ప్రకటిస్తారు. సభ అనుమతి ఇచ్చిన పరిష్కరించా ల్సి ఉంటుంది. తీర్మానాలు ప్రవేశపెట్టిన తర్వాత, దానిని చర్చకు తీసుకొని 10 రోజుల్లోపు సందర్భాలు ఉన్నాయి. అయితే, అధికారంలో ఉన్న పార్టీలకు మెజార్టీ ఉండటంతో ఇప్పటివరకు ఏదీ ఆమోదం పొందకపోవడం విశేషం.

## పుస్తక వివాదంపై స్పందించిన మాజీ ఆర్మీ చీఫ్

**పుస్తకం ఇంతవరకు పబ్లిష్ కాలేదని వెల్లడి**




**న్యూఢిల్లీ :** మాజీ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణెళి మంగళవారం తన పుస్తకం ' ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టనీ' పుస్తక వివాదంపై తొలిసారిగా స్పందించారు. ప్రచురించబడని పుస్తకంపై ఇటీవల పార్లమెంట్ బ్జడెట్ సమావేశాల్లో వివాదం చెలరేగింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ పుస్తకంలో, మోడీ ప్రభుత్వం చైనాతో ఘర్షణ సమయంలో సమర్ధవంతంగా వ్యవహరించలేదని ఉందని ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నరవాణెళి మౌనాన్ని వీడారు. 'ఇది పుస్తక స్థితి' అని పుస్తక పబ్లిషర్ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా సోషల్ మీడియా పోస్టును ఆయన షేర్ చేశారు. 'ఈ పుస్తకం ప్రచురణ హక్కులు తమవేనని, పుస్తకం ఇంకా ప్రింటింగ్‌కు వెళ్లలేదని, ప్రింట్, డిజిటల్, పీడీఎఫ్ లేదా ఏ రూపంలోనూ మేము ఎక్కడా విడుదల చేయలేదని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా వెల్లడించింది. ఇదే సమయంలో ఇంటర్నెట్‌లో సర్క్యూలేట్ అవుతున్న అనధికారిక ప్రింట్లు కాపీరైట్ ఉల్లంఘన కిందకు వస్తాయని, వెంటనే వాటిని ఆపాలని చెప్పింది. ఇప్పుడు ఇదే విషయాన్ని నరవాణెళి కూడా చెబుతున్నారు.కొన్ని రోజులు క్రితం రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రాంగణంలో ఈ పుస్తకం కాపీని చూపిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2020 లడఖ్‌లో భారత్-చైనా ఘర్షణ సమయంలో భారత ప్రభుత్వం సమర్ధవంతంగా వ్యవహరించలేదనే విషయాలు ఇందులో ఉ న్నాయని ఆరోపణలు చేశారు. ఈ పుస్తకం అధికారికంగా విడుదల కాలేదని చెబుతూ లోక్‌సభలో రాహుల్ గాంధీ ఈ పుస్తకంలోని భాగాలను చదివేందుకు అనుమతించలేదు. మరోవైపు, ఇంకా పబ్లిష్ కాని పుస్తకం అక్రమంగా పంపిణీ చేయడంపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

**మన వ్యవసాయాన్ని ముంచేయడం ఖాయం**

**వస్త్ర పరిశ్రకు కూడా కోలుకోలేని నష్టం ఎక్స్ వేదికగా మల్లికార్జున ఖర్గే విమర్శలు**

**న్యూఢిల్లీ :** భారత్ అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, రైతులు, పశువులు, వస్త్ర రంగాన్ని బలహీనపరుస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని ఆయన ప్రజా సంబంధాల ద్రోహంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 9న విడుదలైన వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ఫిబ్రవరి 6న భారత్- అమెరికా సంయుక్త ప్రకటనలో చేర్చని షరతులను వెల్లడించిందని ఖర్గే ఎత్తిచూపారు. రష్యా చమురు నిలిపివేయడానికి భారత్ నిబద్ధతను ప్రదర్శించడం వల్లే అదనంగా 25 శాతం సుంకాల్ని తొలగించినట్లు అమెరికా ప్రకటన పేర్కొంది. ఇది భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమేనని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ÷ారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కేంద్రాన్ని అడిగినప్పుడు రష్యా చమురును నిలిపివేస్తున్నట్లు తమకు చెప్పలేదని ఖర్గే అన్నారు. అయితే ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ ద్వారా ప్రకటించాడు. రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారతదేశ నిబద్ధతను అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసినట్లు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా చెప్పింది. దీన్నిబట్టి చూస్తే భారతదేశ సార్వభౌమత్వాన్ని హరించడానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఈ ఒప్పందం వల్ల భారతదేశ వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. పప్పుధాన్యాలు, జన్యుపరంగా మార్పు చేసిన (జిఎం) ఫీడ్, ఎండిన డిస్టిలర్ల ధాన్యాలు (డిడిజిలు) అంటే మొక్కజొన్న, సోయాబీన్స్.. ఇక పశుగ్రాసం కోసం ఎర్రజొన్నలను కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునేటట్టు సైలెంట్‌గా ఇందులో చేర్చారని ఖర్గే ఆరోపించారు. దీని ఫలితం రెండు కోట్ల రైతులు, పశువుల పెంపకందారులు నష్టోపోవచ్చని ఖర్గే హెచ్చరించారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా.. ఒక ప్రభుత్వం మన వ్యవసాయాన్ని విదేశీ వస్తువులకు తలుపులు పూర్తిగా తెరిచింది. ఈ ఒప్పందంలో అదనపు ఉత్పత్తులు అంటే.. అర్థం ఇదే. ఈ విషయం మనకు తెలుసు. ఫిబ్రవరి 9న కొత్తగా విడుదల చేసిన వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో 'పల్స్' అనే పదాన్ని సైలెంట్‌గా జోడించింది. అయితే ఫిబ్రవరి 6, 2026న జారీ చేసిన భారత్ ? అమెరికా సంయుక్త ప్రకటనలో ఇవి లేవు. మరోవైపు బంగ్లాదేశ్ అమెరికా పత్తి దిగుమతులకి సున్నా శాతమే పన్నులు విధించగా.. భారత్ 18 శాతం పన్నులు విధించడాన్ని ఖర్గే విమర్శించారు. 18 శాతం పన్నులు విధించడాన్న పెద్ద విజయంగా మోడీ ప్రభుత్వం చెప్పుకుంటోందని ఖర్గే ఆరోపించారు. అమెరికా భారత రైతుల కంటే బంగ్లాదేశ్‌ను ప్రోత్సహించి.. తన సొంత లాభాలను కాపాడుకుంది. తిరుపూర్, సూరత్‌వంటి వస్త్ర కేంద్రాలు 18 శాతం పన్నుల పరిధిలోకి రావడంతో భారతీయ వస్త్ర రంగానికి డబుల్ దెబ్బ తగిలింది. జాతీయ ప్రయోజనాలను, ఎగుమతి ఇంజిన్‌ను త్యాగం చేసే ప్రజా సంబంధాల ద్రోహమా అని ఖర్గే ఎక్స్ పోస్టులో ప్రభుత్వాన్ని విమర్శించారు.

# అసంతృప్తి అంతర్గతం..! పైకి మాత్రం భాయి భాయి అంటూ బహిర్గతం...!!

**చాప కింద నీరు... గూడ చర్యం తీరు...!!**
**వెంటనే ఉంటూ వెన్నుపోటు...!**
**కలిగేనా ఓటమి రెప్పపాటు...!!**
**పోటీ అభ్యర్థుల ఇన్నాళ్ల శ్రమ ఫలితం...!**
**దక్కేనా విజయ లిఖితం...!!కలుగుతుందా**
**బంగారు విజయభవితం...!**
**చేర్చేనా విజయతీరాలకు...!!**



**డా. కృష్ణ బంటు**
**సీనియర్ జర్నలిస్ట్,రాష్ట్ర ఉత్తమ జర్నలిస్టు అవార్డు గ్రహీత**

తెలంగాణ రాష్ట్రంలో నేడు జరగనున్న కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఇన్నాళ్ళుగా పడిన శ్రమకు ఫలితం దక్కుతుందా లేదా అన్న ఉత్కంఠమైన చర్చలు సర్వత్రా జరుగుతున్నాయి. ఔర్ ఏక్ దక్క.. విజయం మనదే పక్కా అంటూ వీరమో, విజయ స్వర్గమో అంటూ చావో, రేవో తేల్చుకునే బుధవారం రోజు రానే వస్తుంది. ప్రత్యర్థుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ, మళ్లీ తనదే విజయం అంటూ పోటీ చేసిన అభ్యర్థులు గల్లీ గల్లీలో గల్లాలు ఎగరవేస్తూ, ఓటర్ అన్న ప్రాపకం కోసం అన్ని రకాలుగా ఉన్న అవకాశాలను ఉపయోగించుకుంటూ, ప్రలోభాల ఎరవేసి చేపను లాగినట్టుగా ఓటర్ అన్న నుంచి ఓట్లను లాగటానికి యుక్తులను, శక్తులను, కుయుక్తులను శాయ శక్తులా ప్రదర్శించి ఆఖరి మోకాకు సిద్ధమై ఓటరన్నలను ప్రసన్నం చేసుకొని రాత్రంతా అన్ని రకాలుగా తాయిలాలు అందించి ఉదయాన్నే ఓట్ల తాలింపుకు రెడీగా ఉన్న అభ్యర్థులు విజయమనే మంచి రుచికరమైన వంటకాన్ని ఆస్వాదించడానికి, ఆరగించడానికి, ఆనందపడటానికి సంసిద్ధులు అయ్యారు. రహస్యంగా సర్వేలను చాప కింద నీరు లాగా, గూడ చర్యం చేసే తీరులాగా ప్రత్యేక తర్ఫీదు పొందిన జేమ్స్ బాండ్ 007 గూడచారులను ప్రత్యర్థుల గుంపులో కలిపి, సమాచారాలను సేకరించి, ప్రత్యర్థిని మానసికంగా, ఆర్థికంగా బలహీనపరచి తన తప్పులను మాత్రం సరిదిద్దుకుంటూ, లోపాలను అధిగమిస్తూ, విజయతీరాలకు చేరడానికి కొందరు అభ్యర్థులు పోరాటం చేస్తూ, ఆరాటపడుతూ, ప్రత్యర్థులతో చలగాటమాడుతూ, విజయం కోసం ఎప్పుడెప్పుడా అని ఉబలాటం చెందుతున్నారు. ప్రత్యర్థి దిగాలు పడుతూ గుబులు చెందేలా షాడో టీమ్స్, నమ్మకంగా ఉంటూ నమ్మకద్రోహం చేసే నయవంచకులను, కంటి పాపకు తెలియకుండా కన్నులను చిదిమి వేసే చిల్లర గాళ్లను, అనుభవం ఉన్న స్పెషల్ టీమ్స్ ను ప్రత్యర్థి గుంపులో కలిపి ప్రత్యర్థి లోతుపాతులను తెలుసుకొని దెబ్బతీసే నైపుణ్యాన్ని పుణికి పుచ్చుకున్న పోటీదారులు ప్రత్యర్థి లోగుట్టు తన వేగుల ద్వారా వేగంగా తెలుసుకుంటూ ప్రత్యర్థి ఓటమి ధ్యేయంగా దొంగ దెబ్బ తీస్తూ చేసిన ప్రచారం సత్ఫలితాలను ఇస్తుందనే నమ్మకంతో అనేకమంది పోటీదారులు తొనకకుండా, బెనకకుండా నెమ్మదిగా, నింపాదిగా ఉన్నారు. ప్రత్యర్థి బలహీనతలపై ఫోకస్ పెట్టి చికాకు కలిగిస్తూ, ప్రత్యర్థితో మిత్రత్వం నటిస్తూ అచ్చట, ముచ్చట లాడి మచ్చి క చేసుకుని ఓటర్లు ఎవరెవరు ప్రత్యర్థులతో అనుకూలంగా ఉన్నారు అనుకూలంగా ఉన్న ఓటు బ్యాంకును తమ వైపు తిప్పుకోవడానికి ఇన్నాళ్లుగా పోటీదారులు చెమటోడ్చారు. ఓట్లను పొందడానికి కులాలవారీగా, మతాలవారీగా ప్యాకేజీలు మాట్లాడుకుని, నిత్యం వార్డులలో రహస్యంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని పడ్డ శ్రమంత బ్యాలెట్ బాక్స్ లోకి వెళుతుందా లేదా అన్న సందిగ్ధంలో మరికొందరం అభ్యర్థులు ఉన్నారు.

### అంతర్గతంగా అసంతృప్తి...!బహిర్గతంగా భాయి భాయి అంటూ సంతృప్తి...!

పైకి మాత్రం చిరునవ్వులు చిందిస్తూ,విరజాజులు విరబూయిస్తూ పెదవుల మాటున తీయటి తేనే పలుకులు పలకరిస్తూ, పలవరిస్తూ, లోపల గొంతులో మాత్రము విషపు కత్తులు విరాజిల్లుతుండగా అసంతృప్తిని అంతర్గతంగానే అనుచుకొని, ఓటు కోసం వచ్చే అభ్యర్థులతో ఓటరన్న బయటకు మాత్రం భాయి భాయి అంటూ, ఓటు నీకే అంటూ నమ్మబలుకుతూ చేస్తున్న ప్రమాణాలు నిజమవుతాయా, లేక ఓటమి ప్రమాదం తెచ్చి పెడుతుందా అన్న సంకట స్థితిలో పోటీ చేసిన అభ్యర్థులు విలవిలలాడిపోతున్నారు. గోతి కాడ గుంట నక్కల వలె ప్రత్యర్థి ఓటమి కోసం కాసుకు కూసున్న వైరి వర్గాలు కారు కూతలు కూస్తూ, కత్తులు దూస్తూ చల్లారని అగ్నిగుండంలా బగ్గు మంటున్న రాజకీయ కక్షలతో పగ, కసి, కోపం, క్రోధం తో ఊగిపోతూ ప్రత్యర్థిని చిత్తు చేయడానికి కంకణ బద్ధులైన ఇరు వర్గాలు బాహాబాహి తలపడుతూ, కలబడుతూ చేసిన యుద్ధ పోరాటాన్ని తలపించే ఎన్నికల పోరాటాలు పోలింగ్ స్టేషన్కు చేరుకొని తమకే ఓటు వేస్తారా లేదా అన్న సందిగ్ధంలో మరికొందరు తలలు పట్టుకున్నారు.

అన్ని రకాలుగా తాయిలాల సంతృప్తి ...! అధిగమించామా తమ పైన అసంతృప్తి...! కలుగుతుందా విజయమనే తృప్తి...!!!

ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛగా ఓటు వినియోగించుకుని పరిస్థితులు ఉన్నప్పటికీ ఓటర్లు అనేక రకాలుగా ప్రలోభాలకు లొంగి నిలువైన ఓట్లు డబ్బులకు, మద్యానికి అమ్ముకోవడం ప్రతి ఎన్నికల్లో జరిగే తంతుగా ఉంటుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని ప్రస్తుత కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలలో సామ, దాన, భేద దండోపాయాలు ఉపయోగించి, ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్న పోటీదారులు, ఓటర్లను పలు రకాలుగా బహుమతులు వస్తురూపేనా, డబ్బు రూపేనా అందించి సంతృప్తి చేశామని, అయితే తాము ఓటు పొందడానికి అన్ని రకాలుగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా సక్సెస్ అవుతామా,కాదా అన్న మీ మాంస అందరి అభ్యర్థులలో నెలకొంది. ఏదో కొన్ని ప్రాంతాలలో తప్ప తాము తప్పక గెలుస్తాము అనే ధీమా అందరిలో లేకపోవడం గమనించదగ్గ విషయం. అన్ని రకాలుగా ఇచ్చిన డబ్బును, మద్యాన్ని తీసుకొని, ఏర్పాటుచేసిన విందులలో పసందుగా పాల్గొని చికెన్, మటన్లు అందించి కడుపారా ద్రవపదార్థాలు, ఘన పదార్థాలు ఘనంగా నింపినప్పటికీ, ఓట్లు రాలుతాయా, లేదా అన్నది నేడు జరిగే పోలింగ్ లో ఓటింగ్ సరళి ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. ఎన్నాళ్లో వేచి న హృదయం, ఈనాడే ఓటరు రూపంలో ఎదురు అవుతుంటే ఇంకా తెలవారదేమి, ఓట్లన్నీ నాకే గంపగుత్తగా పడవేమి అన్నట్టుగా పోటీదారులు ఆభగా, ఆత్రుతగా, ఆసక్తిగా ఆలోచనలో ఊగి సలాడుతున్నారు. బుధవారంతో సవార్లన్నీ బావిలో పడ్డట్టుగా ఓట్లన్నీ బ్యాలెట్ బాక్స్ లో పడిపోయి లెక్కింపు కేంద్రాలకు చేరుకొని 13వ తారీకు ఓట్ల లెక్కింపు జరగనుండగా రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలలో మధ్యాహ్నం నుంచి ఎవరు గెలిచారో, ఎవరు ఓడారో తేట తెల్లం కానుంది.

# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం



### మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం
### ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్
### గుర్తింపు కార్డుతోనే ఓటింగ్: కలెక్టర్

సూర్యాపేట, ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి): జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల్లో ఈ నెల 11న (బుధవారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటిని చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటో ఉన్న పోస్టాఫీస్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, లేబర్ గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్, ఉద్యోగ గుర్తింపు కార్డులు, దివ్యాంగుల గుర్తింపు కార్డు తదితర అధికారిక గుర్తింపు కార్డులు చెల్లుబాటు అవుతాయని తెలిపారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో 141 వార్డుల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు 446 మంది పోలింగ్ అధికారులు, 446 ఏపీఓలు, 1,340 ఓపీఓలను నియమించినట్లు వెల్లడించారు. ఎన్నికల పర్యవేక్షణకు 51 మంది జోనల్ అధికారులు, 46 మంది రూట్ అధికారులు విధులు నిర్వహిస్తారని తెలిపారు.

స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం 10 ఎస్ఎస్‌టీలు, 15 ఎఫ్ఎస్‌టీలు, 7 వీవీటీలు, 7 ఏటీ బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థుల వ్యయ నియంత్రణకు 5 మంది ఏఈఓలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 55 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు.

ఎన్నికల సామగ్రి తరలింపుకు 46 బస్సులు సిద్ధం చేశామని, పోలీస్ ఎస్కార్టుతో బందోబస్తు కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు.

అనంతరం కలెక్టర్, జిల్లా ఎస్పీ, జనరల్ అబ్జర్వర్ పాండదాస్‌తో కలిసి ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్.. గుర్తింపు కార్డుతోనే ఓటింగ్: కలెక్టర్

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల్లో ఈ నెల 11న (బుధవారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటిని చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటో ఉన్న పోస్టాఫీస్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, లేబర్ గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్, ఉద్యోగ గుర్తింపు కార్డులు, దివ్యాంగుల గుర్తింపు కార్డు తదితర అధికారిక గుర్తింపు కార్డులు చెల్లుబాటు అవుతాయని తెలిపారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో 141 వార్డుల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు 446 మంది పోలింగ్ అధికారులు, 446 ఏపీఓలు, 1,340 ఓపీఓలను నియమించినట్లు వెల్లడించారు. ఎన్నికల పర్యవేక్షణకు 51 మంది జోనల్ అధికారులు, 46 మంది రూట్ అధికారులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం 10 ఎస్ఎస్‌టీలు, 15 ఎఫ్ఎస్‌టీలు, 7 వీవీటీలు, 7 ఏటీ బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థుల వ్యయ నియంత్రణకు 5 మంది ఏఈఓలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 55 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు.

ఎన్నికల సామగ్రి తరలింపుకు 46 బస్సులు సిద్ధం చేశామని, పోలీస్ ఎస్కార్టుతో బందోబస్తు కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు.

అనంతరం కలెక్టర్, జిల్లా ఎస్పీ, జనరల్ అబ్జర్వర్ పాండదాస్‌తో కలిసి ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం చేయాలి

### ప్రధాన నిందితుడు ఎస్సై సురేష్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి: మందకృష్ణ మాదిగ



పెన్ పహాడ్ , ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి): సూర్యపేట జిల్లా పెన్ పహాడ్ మండల కేంద్రంలోని సత్య గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సంతాప సభ నిర్వహించారు. కర్ల రాజేష్ లాకప్ డెత్‌కు కారణమైన పోలీసు అధికారులు, బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామాజిక పరివర్తకుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ కోదాడలో జరిగిన కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి అత్యంత బాధాకరమని విమర్శించారు. పోలీసులు ఎలాంటి తప్పు చేయకపోతే ఇప్పటివరకు రీపోస్ట్‌మార్టం ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు.

రాజేష్‌ను చిత్రహింసలకు గురిచేసి లాకప్ డెత్‌కు కారణమైన వ్యక్తి చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి అని ఆరోపించారు. పోస్టుమార్టం నిర్వహించిన లక్ష్మీకాంత్ రెడ్డి, ఫోటోగ్రఫీ చేసిన రామకృష్ణ రెడ్డి సహా పలువురు తప్పులు చేస్తూ దళిత యువకుడి ప్రాణాలను బలి తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత పోలీసు అధికారులు, ఉన్నతాధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లాకప్ డెత్ కేసులో అనేక సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ ప్రధాన నిందితుడైన ఎస్సై సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయకుండా కాపాడుతున్నారని ఆరోపించారు. బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వం తగిన రాజకీయ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ఈ సంతాప సభకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొండేటి గోపి మాదిగ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు. టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగిరి యుగంధర్, సీపీఎం మండల నాయకుడు రణపంగా కృష్ణ, బహుజన సమాజ్ పార్టీ మండల నాయకుడు శ్రావణ్ కుమార్ పూలే, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ, మండల ఇన్‌చార్జి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెన్నోల్ల నరసింహ మాదిగ, కో--ఇన్‌చార్జి బైరుపాక శివకుమార్ మహేందర్ మాదిగ, మండల ఎమ్మెస్పీ అధ్యక్షుడు గుగ్గిళ్ల శాంసన్ మాదిగ, నాయకుడు కొండమీద గోపి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల బందోబస్తులో అప్రమత్తతే కీలకం

### సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి: ఎస్పీ నరసింహ



సూర్యాపేట, ఫిబ్రవరి 10,(చాటింపు ప్రతినిధి) : ఫిబ్రవరి 11న జిల్లాలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వర్తించనున్న పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ నరసింహ ×ూూ దిశానిర్దేశం చేశారు. పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా పూర్తి అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన ప్రాంతాలను విడిచిపెట్టకూడదని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమబద్ధంగా ఉంచాలని, అనుమతిలేని వ్యక్తులను కేంద్రాల పరిసరాల్లోకి అనుమతించవద్దని సూచించారు. పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని తెలిపారు. ఓటర్లు సెల్‌ఫోన్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకువస్తున్నారా అనే అంశంపై నిరంతర నిఘా ఉంచాలని చెప్పారు.



ఎన్నికల సామాగ్రి తరలింపులో రూట్ మొబైల్ పోలీసు సిబ్బంది విధులు కీలకమని పేర్కొన్నారు. పోలింగ్ సామగ్రిని బూత్‌లకు చేరవేయడం, అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే సమయంలో పూర్తి భద్రత కల్పించాలని సూచించారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు, గొడవలు లేదా గుంపులు ఏర్పడితే వెంటనే స్ట్రైకింగ్ ఫోర్స్ లేదా రూట్ మొబైల్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

ఎన్నికల కోడ్ (ఎంసీసీ)ను ప్రతి అధికారి, సిబ్బంది కచ్చితంగా పాటించాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధుల నిర్వహణలో సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని, వ్యక్తిగత నిర్ణయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐలు వెంకటయ్య, రాజశేఖర్, రామారావు, శివకుమార్, ప్రవీణ్ కుమార్, ఎస్సైలు, ఏఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి....

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.**



మంచిర్యాల ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దిపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో లీడ్ డిస్ట్రిక్ట్ మేనెజర్ తిరుపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఆర్ సెటి డైరెక్టర్ ఆశిష్, సిఎఫ్ఎల్ కౌన్సిలర్లతో కలిసి కార్యక్రమ సంబంధిత గోడ పత్రులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాహకలెక్టర్ మాట్లాడుతూ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుండి 13వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు-2026 కార్యక్రమం ద్వారా ప్రజలకు కెవైసి మోసం, మనీమ్యూల్, ఫస్ట్ స్టెప్ టు సేఫ్ బ్యాంకింగ్ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు కెవైసి ప్రాముఖ్యత, మోసాలు, డిజిటల్ అరెస్ట్ అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. వారోత్సవాలలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని బ్యాంకుల మేనేజర్ల ఆధ్వర్యంలో 118 సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాలకు స్వయం సహాయక సంఘాలు, రైతులు, ఖాతాదారులు, మహిళలు, వృద్ధులు, పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్.**



మంచిర్యాల ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 11వ తేదీన జరగనున్న పోలింగ్ రోజున అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోసం నోటిఫై చేయబడిన ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, దుకాణాలు, కర్మాగారాలకు పోలింగ్ రోజున ఆయా సంస్థలలో పని చేసే ఉద్యోగులు తమ ఓటు హక్కునువినియోగించుకోవడానికి వీలుగా వేతనంతో కూడిన సెలవు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజున వినియోగించే ప్రభుత్వ భవనాల విద్యా సంస్థలకు పోలింగ్ నిర్వహణ కోసం స్థానిక సెలవులు ఉపయోగించబడతాయని తెలిపారు.

# భూ బాధితులకు పరిహారం చెక్కు అందజేత

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.**



మంచిర్యాల ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : జిల్లాలోని క్యాతనపల్లి మీదుగా చేపట్టిన జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య తో చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్యాతనపల్లి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన 19 మందికి చెందిన 1 కోటి 32 లక్షలు 70 వేల 382 రూపాయల చెక్కును వెంకటస్వామి, రజిత లకు అందించడం జరిగిందని తెలిపారు.

# సమ్మెతో కార్మికుల ఐక్యతను చాటాలి



మందమర్రి ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : ఫిబ్రవరి 12న నిర్వహించు దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని, సమ్మెతో కార్మికుల ఐక్యతను చాటాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఏరియాలోని కాసీపేట గనిపై జేఏసీ ఆధ్వర్యంలో ద్వార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల అమలును వ్యతిరేకిస్తూ, సింగరేణిలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలోనూ విజయవంతం చేయాలని కోరారు. బిజెపి మోడీ ప్రభుత్వం కార్మికులకు అండగా ఉన్న కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసి, కార్మికులను విదేశీ పెట్టుబడి దారుల క్రింద బానిసలుగా మార్చేందుకు, కార్మికులకు చట్టాలు లేకుండా కోడ్ లుగా మార్చి, కార్మిక వర్గాన్ని శ్రమదోపిడికి గురిచేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. చివరకు సమ్మె చేస్తే జరిమానాలు, జైలు శిక్షలు వేసే విధంగా చేస్తున్న విధానాలను ప్రతీ కార్మికులు సమ్మె చేసి, కార్మికుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. సమ్మె వలన సంస్థకు ఉత్పత్తి పరంగా జరుగుతున్న నష్టంగా చూడకూడదని, కార్మికులకు కష్టార్జితమైన పట్టు పైసలను సైతం తగ్గించేలా చూస్తున్నారని, ఉద్యోగ భద్రత లేకుండా ఉండేలా ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ను తీసుకురావడం సరికాదని తెలిపారు. పనిగంటలను పెంచడం వలన కార్మికులకు ఇబ్బందే కాకుండా అధికారులు సైతం ఉత్పత్తి కోసమే అన్నట్లుగా తయారయ్యి, మానసికంగాను ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దాగం మల్లేష్ లక్ష్మీనారాయణ, అల్లి రాజేందర్, నాగవల్లి శ్రీధర్ దెబ్బటి శ్రీనివాస్,బన్న లక్ష్మణ్ దాసు, బేరీ శంకర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్.**



మంచిర్యాల ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలోహకౌంటింగ్ సిబ్బందిహోరాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె గంగాధర్, జిల్లా విద్యాధికారి యాదయ్య లతో కలిసి కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ కొరకు అదనపు సిబ్బందితో కలిపి 66 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 132హోమంది కౌంటింగ్ సహాయకులు, బెల్లంపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 19 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 37హోమంది కౌంటింగ్ సహాయకులు, చెన్నూరు మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 10 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 20హోహోమంది కౌంటింగ్ సహాయకులు,, క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 48హోమంది కౌంటింగ్ సహాయకులు, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 9 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 18హోమంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరి 12వ తేదీన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కు కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో, బెల్లంపల్లి, క్యాతనపల్లి, చెన్నూరు, లక్షెట్టిపేట మున్సిపాలిటీలకు కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది ఆయా మున్సిపల్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని, ఫిబ్రవరి 13వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్, ఆయా మున్సిపాలిటీలకు సంబంధించి ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు సకాలంలో హాజరై, విధులను బాధ్యతాయ-ుతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణ కొరకు పూర్తి స్థాయి ఏర్పాట్లు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్.**



మంచిర్యాల ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా ఫిబ్రవరి 11వ తేదీన జరగనున్న పోలింగ్ నిర్వహణ కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో కమిషనర్ అన్వేష్ తో కలిసి ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించి సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, 13వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూరు మున్సిపల్ పరిధిలోని చెన్నూరు పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్కెసిఓఎ క్లబ్ లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టి, సామాగ్రిని, సిబ్బందిని సురక్షితంగా కేటాయించిన ప్రకారం పోలింగ్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం జరిగిందని, ఈసారి ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖతో పాటు అటవీ, ఆబ్కారీ శాఖ సిబ్బంది సమన్వయం చేసుకొని ఎన్నికల ప్రక్రియ సమ-ర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 సమ్మెకు దూరంగా ఉండండి

**ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ..**

**యూనియన్ నాయకులతో సమీక్ష సమావేశం.....**




మందమర్రి ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : వివిధ డిమాండ్ లతో ఫిబ్రవరి 12న తలపెట్టిన ఒక్కరోజు సమ్మెకు దూరంగా ఉండాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన ఏరియా జిఎం కార్యాలయంలో అన్ని కార్మిక సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, వివిధ డిమాండ్లతో ఫిబ్రవరి 12న ఒక్కరోజు సమ్మెకు పిలుపునిస్తూ, సింగరేణి కార్మికులు సైతం సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ సమ్మె డిమాండ్లలో అత్యధికం సింగరేణి కార్మికులకు మాత్రమే సంబంధించినవి కావని, సింగరేణి యాజమాన్యం తీర్చగలిగినవి సైతం కావని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ పరిధిలోని సమస్యలను చర్చలతో పరిష్కరించుకునే అవకాశం కలదని, అటువంటప్పుడు సింగరేణి కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనవలసిన అవసరం లేదని సూచించారు. అన్ని కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జివిల్ ప్రసాద్, డీజీఎం పర్సనల్ సిహెచ్ అశోక్, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఐఎన్టియుసి బ్రాంచ్ కార్యదర్శి దేవి భూమయ్య, సిఐటియు డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్, ఐఎఫ్టియు నాయకుడు జాఫర్, హెచ్ఎంఎస్ నాయకుడు సుదర్శన్, ఏరియా సీనియర్ పర్సనల్ అధికారి సందీప్ లు పాల్గొన్నారు.

# గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి

**మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ.**

మందమర్రి ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించి, ఎక్కడ ప్లాస్టిక్ వ్యర్థం లేకుండా చూసుకోవాలని మండల పంచాయతీ అధికారి ఎం సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని వెంకటపూర్ గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే సమయంలో పంచాయతీ ట్రాక్టర్ కు గన్ని సంచులు అమర్చి, తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని, కంపోస్ట్ షెడ్ నందు వరి కంపోస్ట్ ఎరువును తయారు చేయాలని సూచించారు. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేసి, ఫిబ్రవరి 15 వరకు వంద శాతం పూర్తి చేయాలన్నారు. అన్ని రకాల రిజిస్టర్లు మెయింటైన్ చేయాలని, వాటిని అప్డేట్ చేసి, ఉంచాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న ట్రేడ్ లైసెన్స్ లను వెంటనే రెన్యువల్ చేయించాలని సూచించారు. మురికి కాలువలో ఉన్న సిల్ట్ ను తొలగించాలని, పొడి చెత్త ఎక్కడ కనిపించకుండా సంచిలో సేకరించాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్ ను సందర్శించి, సెగ్రిగేషన్ షెడ్ యందు సేంద్రీయ ఎరువును క్రమం తప్పకుండా తయారు చేయాలన్నారు. వచ్చే వేసవికాలంలో మంచినీటికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, క్రమం తప్పకుండా మంచినీటిని గ్రామ ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు. నర్సరీలోని విత్తనాలు వంద శాతం మొలకెత్తుటకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సెగ్యం వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించుకోవాలి

**ఓటర్లను బెదిరిస్తే కఠిన చర్యలు....**

**సిద్దిపేట పోలీస్ కమిషనర్ పెరుమాళ్ రష్మీ....**



చేర్యాల ఫిబ్రవరి 10(చాటింపు ప్రతినిధి) : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని, ఓటర్లను బెదిరిస్తే కఠిన చర్యలు తప్పు అని సిద్దిపేట పోలీస్ కమిషనర్ పెరుమాళ్ రష్మీ సూచించారు. మంగళవారం చేర్యాల మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన బదిలీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పోలింగ్ కేంద్రాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీ బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటర్లు, వికలాంగులు, యువకులను పోలీస్ శాఖ ఎవరిని కూడా ఇబ్బందులకు గురిచేయవద్దని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థుల పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో చేర్యాల సిఐ బానోతు రమేష్ నాయక్, చేర్యాల ఎస్సై వేముల నవీన్, కొమురవెల్లి ఎస్సై మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం కృషి

**ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ**

**ఉద్యోగులతో కలిసి కంపెనీ క్యాంటీన్లో భోజనం....**



మందమర్రి ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి తోపాటు కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ తెలిపారు . మంగళవారం ఆయన ఏరియాలోని కేకే ఓసిపిని సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సౌకర్యార్థం లంచ్ బ్రేక్ సమయంలో కేకే ఓసిపి క్యాంటీన్ లో భోజనాలు ప్రారంభమైన సందర్భంగా, ఆయన క్యాంటీన్ ను పరిశీలించి, ఉద్యోగులతో కలిసి భోజనం చేశారు. అనంతరం జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ.... క్యాంటీన్లో అందిస్తున్న ఆహార నాణ్యతను, పరిశుభ్రత ప్రమాణాలను నిరంతరం పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఓసిపి ప్రాజెక్ట్ అధికారి ఎం మల్లయ్య, మేనేజర్ కే రామరాజు, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి ఓసిపి పిట్ కార్యదర్శి మద్రి కుమారస్వామి లు పాల్గొన్నారు.

# తక్షణమే తపాస్ పల్లి లైమెన్ పై వెంటనే చర్యలు తీసుకోవాలి

**ప్రతి పనికి లంచం డిమాండ్ చేస్తున్నా తపస్పల్లి లైమెన్..**



కొమురవెల్లి ఫిబ్రవరి 10(చాటింపు ప్రతినిధి) : కొమురవెల్లి మండలంలోని తపాస్ పల్లి గ్రామంలో జూనియర్ లైన్మెన్ గా నిధులు నిర్వహిస్తు ప్రతి పనికి లంచం తీసుకుంటూ పనిచేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న బొంగోని సంపత్ ని వెంటనే సస్పెండ్ చేయాలని తపాస్పల్లి సర్పంచ్ పుట్ట కనకరాజు, ఉపసర్పంచ్ నర్సింలు, వార్డు సభ్యులు కలిసి గ్రామ ప్రజల దగ్గర లంచం తీసుకున్న వివరాలతో కూడిన లెటర్ ను కొమురవెల్లి మండల ఏఈ కి మంగళవారం లిఖితపూర్వకంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కనక రాజు మాట్లాడుతూ తపాస్ పల్లి గ్రామంలో లైన్మెన్ గా విధులు నిర్వర్తిస్తున్న బొంగోని సంపత్ కొద్ది రోజులుగా రైతుల దగ్గర అదనంగా డబ్బులు వస్తువులు చేసి పనిచేయడం లేదని రైతులు స్వయంగా వచ్చి గ్రామ పంచాయితీలో ఆధారాలతో చెప్పడం జరిగింది. బాధితులలో ఎల కనకయ్య వద్ద 5000 రూపాయలు, కొండపాక లచ్చవ్వ తపస్సు పల్లి నాలుగో వార్డు సభ్యురాలు దగ్గర ఏజీయల్ సంబంధించి 7000 రూపాయలు డిడి కడతాను తీసుకొని ఇంతవరకు డబ్బులు ఇవ్వడం లేదు, డిడి కట్టడం లేదని గ్రామసభలో పేర్కొన్నారు. హైదరాబాద్ లో నివాసం ఉంటున్నా వాని ఫరహాదు కు మీటర్ ఇప్పిస్తా అని 14 వేలు తీసుకున్నారు. ఇలా గ్రామంలోని ప్రజలను ఇబ్బంది పెట్టే లైన్మెన్ ను వెంటనే చర్యలు తీసుకొని అతని స్థానంలో వేరే లైన్మెన్ ని తపస్పల్లికి పంపించవలసిందిగా కోరడం జరిగిందని తెలిపారు.

# నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

**ఆకునూరు సర్పంచ్ కొమ్ము రవి, చేర్యాల విద్యుత్ ఏఈ కనకయ్య**



చేర్యాల ఫిబ్రవరి 10(చాటింపు ప్రతినిధి) : నాణ్యమైన విద్యుత్ ను అందించడమే ప్రజా బాట లక్ష్యమని ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, చేర్యాల విద్యుత్ రూరల్ ఏఈ కనకయ్య అన్నారు. మంగళవారం ఆకునూరులో నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా పలు విద్యుత్ నియంత్రికలు, స్తంభాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్ కు అంతరాయం లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ సమస్యలను తెలుసుకుంటారన్నారు. వెంటనే స్పందించి లోల్టేజ్ లో భాగంగా బీసీ కాలనీ, ఖచ్చిరు వద్ద 25కేవీ రెండు నియంత్రికలు ఏర్పాటు చేసి లోల్టేజ్ సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ కర్నాల సంపత్, ఉప సర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, వార్డు సభ్యులు నూనె శేఖర్, ఎండి హైమద్, జూపల్లి కార్తీక్ రెడ్డి, అందె లక్ష్మి, సూర అనిత, తాడికొండ శేఖర్ యాదవ్, భూమని భాస్కర్, సుంచు హేమ, గణపురం బాల నర్సమ్మ, మంతపురి భాగ్యలక్ష్మి, గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొమురవెల్లి మల్లన్న దర్శించుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



కొమురవెల్లి ఫిబ్రవరి 10(చాటింపు ప్రతినిధి) : మంగళవారం రోజు పినపాక శాసనసభ్యులు, జనగామ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీ పాయం వెంకటేశ్వర్లు కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ గంగం నరసింహా రెడ్డి సమక్షంలో కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్ల కు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించే స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం జనగామ నియోజకవర్గం ఇంచార్జీ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చేర్యాలలోని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి, కొమురవెల్లి దేవస్థానం ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు లింగం, ఎల్లయ్య ఇతర నాయకులు పాల్గొన్నారు.

# బాలయ్య నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే కె.పి వివేకానంద....



కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బి.ఆర్.ఎస్.ఎల్.పీ విప్, ఎమ్మెల్యే శ్రీ కె.పీ. వివేకానంద గాజులారామారం 125వ డివిజన్‌లోని బల్లయ్య నగర్‌లో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి 22వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులతో కలసి ఉత్సవాలలో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తి, సంప్రదాయాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మనసులకు శాంతి, స్ఫూర్తిని ఇస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగేష్, సాయిలు, గోకుల్ ప్రసాద్, గంగయ్య, సునీల్ కుమార్ వర్మ, పార్వతి, శ్యామ్ సుందర్, చిన్న, గంగారాం మరియు స్థానిక నాయకులు విజయ్ రామ్ రెడ్డి, కస్తూరి బాలరాజు, అడ్వకేట్ కమలాకర్, పరుష శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ సాయి, నవాబ్ భాయ్, సుంకరి చందు, తారా సింగ్, శివ నాయక్, చందు గౌడ్, నవీన్, అసిఫ్, చిన్న చౌదరి, మక్సూద్ భాయ్, గుట్ట వేణు యాదవ్, బౌరంపేట శ్రీనివాస్ రెడ్డి, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రౌడీషీటర్లకు జగద్గిరిగుట్ట పోలీసుల హెచ్చరిక



కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో ఈరోజు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి ప్రస్తుత కార్యకలాపాలను ఆరా తీశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, నేరాలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జగద్గిరిగుట్ట ఇన్ స్పెక్టర్ వెంకటేశం హెచ్చరించారు. సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు.

# మెపా చేర్యాల మండల అధ్యక్షుడిగా చింతల పరుశురాములు...






చేర్యాల ఫిబ్రవరి 10(చాటింపు ప్రతినిధి) మెపా ( ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ) సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం అధ్యక్షుడిగా చింతల పరశురాములు ముదిరాజ్ ను నియమిస్తూ మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మంగళవారం నాడు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చింతల పరశురాములు మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు పిట్ల ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి నాయిని కృష్ణ లకు కృతజ్ఞతలు తెలిపి, సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పరుశురాములు మాట్లాడుతూ మండలంలో ముదిరాజ్ ల ఐక్యత కొరకు కృషి చేస్తామని,ఈ ప్రభుత్వం పై రిజర్వేషన్ కోసం ఒత్తిడి చేస్తామని అన్నారు.

# డివైడర్ నీ ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలు



చేర్యాల ఫిబ్రవరి 10(చాటింపు ప్రతినిధి) : చేర్యాల పట్టణ కేంద్రంలో ప్రధాన జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చేర్యాల పట్టానికి చెందిన తాహేర్ తో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాహేర్ రోజు వారిలా తన పనిలో నిమిత్తం ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సమయంలో యూనియన్ బ్యాంక్ సమీపంలో తన వాహనం అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మరో వ్యక్తికి అదుపుతప్పిన బైక్ తగలడంతో గాయాలయ్యాయని తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది గాయపడిన ఇద్దరినీ చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామంలో కాళ్ళే సిద్ధమ్మ అనారోగ్యంతో మృతిచెందగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సిద్ధమ్మ మృతదేహానికి పులామాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

– యాదగిరిగుట్ట ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి)

# కేబుల్ ఛానళ్లకు మద్దతుగా ఐ&పీఆర్ కార్యాలయం జేఏసీ ముట్టడి

**పాల్గొన్న టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్ 2843) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య.**



కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 10 చాటింపు (ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలో కేబుల్ ఛానళ్లపై జరుగుతున్న కక్షపూరిత, వివక్షపూరిత చర్యలకు నిరసనగా కేబుల్ ఛానల్ జేఏసీ పిలుపు మేరకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని ఐఅండ్‌పీఆర్ కార్యాలయం వద్ద భారీ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో రాష్ట్రంలోని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, కేబుల్ ఛానల్ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ....ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛ మూలస్తంభమని పేర్కొన్నారు. కేబుల్ ఛానళ్లపై ఒత్తిళ్లు, పరిమితులు విధించడం ద్వారా ప్రజల గొంతును నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తూ, తక్షణమే ఇలాంటి చర్యలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మామిడి సోమయ్య, టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్--2843) రాష్ట్ర కన్వీనర్ పాల్గొని కేబుల్ ఛానళ్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మీడియాపై కక్ష సాధింపు చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారతాయని, జర్నలిస్టు సంఘాలు ఎట్టి పరిస్థితుల్లోనూ మౌనంగా ఉండవని ఆయన స్పష్టం చేశారు.కేబుల్ ఛానళ్లకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని జేఏసీ నేతలు ప్రకటించారు. ఈ ముట్టడి కార్యక్రమం మీడియా హక్కుల పరిరక్షణకు ఒక బలమైన సంకేతంగా నిలిచిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# శివరాత్రి సందర్భంగా 'ఈశ్వర సర్వేశ్వర' భక్తిగీత ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద..



కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : రాబోయే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని, భక్తిగీతం 'ఈశ్వర సర్వేశ్వర' ను బి.ఆర్.ఎస్. ఎల్.పీ. విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే శ్రీ కే.పీ. వివేకానంద పెట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ భక్తిగీతం జగద్గిరిగుట్టలోని కేదార్నాథ్ ఆలయ శివ రుద్ర సాధువు మార్గదర్శకత్వంలో రూపొందించబడింది. ఈ గీతాన్ని సంతోష్ నిర్మించగా, మంకాల విష్ణు ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ, భక్తిగీతాలు యువతను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని తెలిపారు. శివభక్తులందరికీ ముందస్తుగా మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధువు శిష్యులు హనుమంతు, వెంకటేష్, రమేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి వార్షికోత్సవంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ..



కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 10 (చాటింపు ప్రతినిధి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్ లో గల శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి 22వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల నుండి జరుగుతున్న కార్యక్రమాలలో భాగంగా ఎల్లమ్మ జాతర సందర్భంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు హాజరై ఆ రేణుక ఎల్లమ్మ దేవి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..... 22 సంవత్సరాలుగా అమ్మవారి వార్షికోత్సవాలు నిర్వహించడం చాలా సంతోషమని అదేవిధంగా ఆ ఎల్లమ్మ దేవి ఆశిస్సులు కృపాకటాక్షాలుఆయురారోగ్యాలతో ప్రజలందరూ సుఖ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్తులు పాల్గొన్నారు.



హస్మత్ పెట్ మోడల్ మార్కెట్ సెంటర్లో..అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవానికి ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బుర్రి యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ యాదవ్,మెడికల్ ఆఫీసర్ డా:ఎలిజా కెన్నెడీ, ఫార్మసీ ఆఫీసర్ కి ప్రబంధం, ల్యాబ్ టెక్నీషియన్ కె .కీర్తి, అకౌంటెంట్ సునీల్, ఏ ఎన్ ఎంఎస్, సరిత, స్రవంతి, సంధ్యా రాణి, జ్యోతి, మంజుల, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు .

**- ఓల్డ్ బోయినపల్లి ఫిబ్రవరి 10(చాటింపు ప్రతినిధి)**

# వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు ముఖ్యమంత్రికు ఆహ్వానం





**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు. కలసి ఆహ్వాన పత్రిక అందచేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు-2026' ఆహ్వానం అందజేసారు. ఈ రెండు ప్రాంతాల్లో శివరాత్రి ఉత్సవాలు విశేషంగా జరుగుతాయి. అందువల్ల వీటికి హాజరు కావాలని మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ కోరారు.

# గోషామహల్‌లో భారీగా నగదు పట్టివేత

**అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురి అరెస్ట్**

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** గోషామహల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు భారీ మొత్తంలో నగదు పట్టుకున్నారు. సోమవారం సాయంత్రం గోషామహల్ గ్యాన్‌బాగ్ కాలనీలోని గోకుల్ గోల్డ్ ఎలక్ట్రిక్ ఐటమ్స్ షాప్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా సంచులతో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వీరిని ఆపి పరిశీలించగా.. సంచుల్లో భారీగా డబ్బు ఉన్నట్లు బయటపడింది. తనిఖీలో మూడు సంచుల్లో భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం నగదు విలువ రూ.76,87,650గా నిర్ధారణైంది. నగదు తరలింపు తీరు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. అనుమానితులను జ్యోతిరామ్, గణపతి రామ్, మహేందర్‌లుగా పోలీసులు గుర్తించారు. ముగ్గురినీ గోషామహల్ పోలీస్‌స్టేషన్ కు తరలించి నగదుపై విచారణ చేపట్టారు. విచారణ సమయంలో అనుమానితులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పాటు నగదుకు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ పత్రాలను సమర్పించలేక పోయారు. దీంతో నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై గోషామహల్ ఇన్‌స్పెక్టర్ స్పందిస్తూ.. స్వాధీనం చేసుకున్న నగదును ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. అక్రమ నగదు తరలింపులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

# కొండాపూర్‌లో జంగమోని కుంటకు మోక్షం

**మట్టి నింపి ఆక్రమించిన భూమి స్వాధీనం.. హైడ్రా చర్యలతో స్థానికుల హర్షం**

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** హైదరాబాద్ కొండాపూర్ ప్రాంతంలో ఉన్న జంగంకుంట ఆక్రమణలపై హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. సుమారు రూ.700 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడుతూ.. అక్రమ కబ్జాదారులపై కఠిన చర్యలు చేపట్టింది. శేరిలింగం పల్లి మున్సిపల్ కార్యాలయం- మదీనగూడ మార్గంలో జంగమోనికుంటకు సంబంధించిన 4 ఎకరాల భూమిని కబ్జాదారులు ఆక్రమించారు. సర్వే నెంబర్ 134 పరిధిలో ఉన్న జంగమోనికుంటను పూర్తిగా మాయం చేస్తూ.. ఆక్రమణదారులు మట్టితో నింపి చదును చేసినట్లు అధికారులు గుర్తించారు. జంగమోనికుంట చెరువును నాశనం చేసి భూమిని ప్లాట్లుగా విభజించి అమ్మకానికి సిద్ధం చేసినట్లు హైడ్రా గుర్తించింది. ఈ అక్రమాలపై ఇప్పటికే రెవెన్యూ అధికారులు కబ్జాదారులపై కేసులు నమోదు చేశారు. హైడ్రా బృందం రెవెన్యూ అధికారులతో కలిసి జంగమోనికుంట వద్ద జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి, భూమి స్థితిగతులను పూర్తిగా పరిశీలించింది. అక్రమ కబ్జాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసుల సహకారంతో చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను హైడ్రా సిబ్బంది ప్రారంభించింది. భవిష్యత్తులో మళ్లీ ఎలాంటి ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, జల వనరులను రక్షించడమే లక్ష్యంగా హైడ్రాపై ప్రజల నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

# స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితి లేదు

**మాజీమంత్రి శ్రీనివాస గౌడ్ ఆవేదన**

**మహబూబ్‌నగర్,ఫిబ్రవరి10 :** రాష్ట్రంలో సామాన్యులు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితి లేదు. అక్రమ సంపాదనే ధ్యేయంగా కొంతమంది పోలీసులు అధికార పార్టీకి సహకరిస్తూ బీఆర్ఎస్ నాయకులును వేధిస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అధికారులు పని చేయాల్సి ఉంటుంది కానీ,పోలీస్ డిపార్ట్‌మెంటే మొత్తం నడిపిస్తుందని ఆరోపించారు. పోలీసు శాఖ వ్యవహారం చూస్తే సిగ్గు అనిపిస్తుందన్నారు. ఎన్నికల రూల్స్ అందరికి ఒకేలా ఉండాలి. కానీ బీఆర్ఎస్ అభ్యర్థులకే రూల్స్ వర్తిస్తున్నాయని తెలిపారు. పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. సీఎం సొంత జిల్లాలోనే అరాచకాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు డబ్బు, మద్యం పంపిణీకి పోలీసులే సహకరిస్తున్నారని ఆరోపించాఉ. ఎన్నికలే లేకుండా పోలీసులు అందరినీ విత్ డ్రా చేయిస్తే అయిపోయేదిగా! అని ఎద్దేవా చేశారు. ఎన్నికల అధికారులకు ఫోన్ చేస్తే మాకు సంబంధం లేదన్నట్టు ఉంటున్నారు. అందరూ అభ్యర్థులను సమానంగా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడగొట్టడానికి అందరూ ఏకమయ్యారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇవన్నీ నడవవని ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపుతప్పాయి. ఎన్నికల నియమాల ఉల్లంఘనపై అధికారుల పర్యవేక్షణ లేదు, చర్యలు లేవు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను వేధిస్తే ఎవరిని వదిలిపెట్టమని హెచ్చరించారు.

# మంత్రి నిబంధనల ఉల్లంఘన

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. అధికారం అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. తాజాగా జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కాన్వాయ్‌తో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హల్‌చల్ చేశారు. దీంతో ఎన్నికల సంఘం మంత్రిపై కేసు నమోదు చేసింది. మరోవైపు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా గద్వాలపట్టణంలో మంగళవారం ఉదయం నుంచి వార్డుల్లో పర్యటించారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో మీటింగ్ లు నిర్వహించారు.

# పిఎంజివై నిధుల మంజూరుకు

**కేంద్రానికి ప్రతిపాదనలు పంపండి.. సిఎస్ కె. రామకృష్ణా రావు**

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన నాలుగవ దశలో భాగంగా రాష్ట్రంలో రోడ్ కనెక్టివిటి లేని 227 ఆవాసాల్లో 642 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నేడు డా. బీ.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో పీ.ఎం.జి.ఎస్.వై 4 వ దశ పనుల మంజూరుకై పంపే ప్రతిపాదనలపై రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ లతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, పీ.ఎం.జి.ఎస్.వై లో భాగంగా ఇప్పటి వరకు మూడు దశలలో రాష్ట్రానికి మంజూరైన రహదారులు, వంతెనల నిర్మాణ పనులను పూర్తి చేశామని, ఈ పథకం నాలుగవ దశ క్రింద రాష్ట్రంలో పక్కా రహదారులు లేని 227 ఆవాసాలల్లో 642.23 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అయితే, వీటిలో, 34 పనులకు గాను 148 కిలోమీటర్లకు అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉందని, ఈ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణ పనులకు సంబంధించి మరో వారం రోజుల్లో డీపీఆర్ లను పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

# వ్యభిచారం, మానవ అక్రమరవాణ కేసు

**అమెరికాలో పట్టుబడ్డ ఎనిమిది మంది**

**అందులో వరంగల్‌కు చెందిన సుహృత్ రెడ్డి**

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** అమెరికాలో జార్జియా రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో తెలుగు వ్యక్తి చాడ సుహృత్ రెడ్డి కూడా ఉండటం గమనార్హం. అట్లాంటా శివారు ప్రాంతాలైన శాండీ స్ప్రింగ్స్, డన్వుడీ పోలీసులు సంయుక్తంగా అండర్ కవర్ ఆపరేషన్ ఆపరేషన్ నిర్వహించిన వీరిని పట్టుకున్నారు. మానవ అక్రమ రవాణా, వ్యభిచార ముఠాలపై మానవ అక్రమ రవాణా లక్ష్యంగా జనవరి 29, 30వ తేదీల్లో ఆపరేషన్ శాండీ స్ప్రింగ్స్ గార్డియన్ పేరుతో అమెరికాలో పోలీసులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. అట్లాంటాలోని పవర్స్ ఫెర్రీ రోడ్డు సమీపంలోని హోటళ్లలో ఈ సోదాలు నిర్వహించారు. అక్రమంగా లైంగిక కార్యకలాపాలకు పాల్పడటం, వ్యభిచారం కోసం సంప్రదించడం వంటి నేరాలు కింద 8 మందిని పట్టుకున్నారు. వీరిపై సొలిసిటేషన్ ఫర్ ఇల్లిసెట్ సెక్సువల్ యాక్ట్ కింద వీరిపై కేసులు నమోదు చేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. కాగా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగువారు ఇలాంటి నేరాల్లో పట్టుబడటం ఇప్పుడు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అరెస్టయిన చాడ సుహృత్ రెడ్డిది తెలంగాణలోని వరంగల్‌గా తెలుస్తోంది. 2020లో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన అతను ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. 2022లో అమెరికాలోని అరిజోనా స్టేట్ ఆఫ్ యూనివర్సిటీలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీపై ఎంఎస్ పూర్తి చేసినట్లు సమాచారం. వ్యభిచారం కింద అతనిపై కేసు నమోదైంది. ఈ కేసు రుజువైతే ఏడాది పాటు జైలుశిక్షతో పాటు రూ.90 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

# మున్సిపల్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

**కాంగ్రెస్ చర్యలపై ఇసికి బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు**

**హైదరాబాద్,ఫిబ్రవరి10 :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తుంగలో తొక్కుతోందని భారత రాష్ట్ర సమితి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కురువ విజయ్ కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినిని కలిసి, అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలపై సమగ్ర వినతి పత్రాన్ని సమర్పించింది. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసి కాంగ్రెస్ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రచారం ముగిసినా.. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బొమ్మెర రామ్మూర్తి, సురివి యాదయ్య గౌడ్, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి సదానంద్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఒక మంత్రి గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, ట్రెజరీ అధికారులు, నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇది అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని వారు మండిపడ్డారు. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. వన్ టౌన్ మరియు రూరల్ సీఐలు కాంగ్రెస్ నాయకులు పంచుతున్న మద్యం, డబ్బుకు రక్షణ కల్పిస్తూ..ప్రచారం చేసుకుంటున్న బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ నాయకులు పోలీసుల అండతో ప్రతిపక్ష పార్టీల ఓటర్లను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. స్వేచ్ఛాయుతమైన ఎన్నికలకు అవకాశం లేకుండా చేస్తున్నారని కమిషన్‌కు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎన్నికల విధుల్లో పక్షపాతంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులను వెంటనే బదిలీ చేయాలి. క్షేత్రస్థాయిలో వీడియో ఫుటేజీలను పరిశీలించి, అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. సామాన్య ఓటరు భయం లేకుండా ఓటు వేసేలా తటస్థ వాతావరణాన్ని కల్పించాలని కోరారు.

# లివర్ ఆరోగ్యంగా ఉండాలంటే ఎప్పటికప్పుడు వీటిని తీసుకోవాల్సిందే!

మన శరీరంలో కాలేయం అనేక విధులను నిర్వర్తిస్తుంది. శరీరం నుండి విషాన్ని బయటకు పంపించడం, శరీర జీవక్రియలను నిర్వహించడం, జీర్ణక్రియకు మద్దతు ఇవ్వడం, శరీరానికి అవసరమైన పోషకాలను నిల్వ చేయడం ఇలా అనేక రకాల విధులను ప్రతిరోజూ నిర్విరామంగా నిర్వర్తిస్తుంది. కాలేయ ఆరోగ్యం ఏ మాత్రం దెబ్బతిన్నా మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. కనుక కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. సరైన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు కొన్ని సులభంగా తయారు చేసుకునే పానీయాలను తీసుకోవడం ద్వారా కాలేయాన్ని శుభ్రపరుచుకోవడంతో పాటు కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పానీయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



### నీరు, గ్రీన్ టీ..

కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే నీటిని ఎక్కువగా తాగాలి. నీరు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉండడంతో పాటు శరీరం నుండి విషాలు ఎక్కువగా బయటకు తొలగిపోతాయి. అలాగే క్రీమ్, చక్కెర వంటివి లేకుండా బ్లాక్ కాఫీ తాగడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా చేయడంలో సహాయపడతాయి. దీంతో ఫ్యాటీ లివర్, సిర్రోసిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. క్రమం తప్పకుండా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కాలేయ ఆరోగ్యాన్ని కాపాడడంలో మనకు దోహదపడతాయి.

### బీట్ రూట్, నిమ్మకాయ..

బీట్‌రూట్ రసం కూడా కాలేయ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది కాలేయానికి ఒక సహజ టానిక్ లాగా పని చేస్తుంది. బీట్‌రూట్ రసంలో ఉండే బీటాలైన్లు, నైట్రేట్లు కాలేయం నిర్విషీకరణ ఎంజైమ్‌లను పెంచుతాయి. బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల కాలేయ వాపు తగ్గుతుంది. అలాగే ఆకుకూరలు, క్యారెట్లు, సెలెరీ వంటి వాటితో జ్యూస్ చేసి తీసుకోవడం వల్ల కాలేయంలో డీటాక్సిఫికేషన్ ప్రక్రియతో పాటు కాలేయం ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. రోజూ ఒక గ్లాస్ నిమ్మకాయ నీరు తాగడం వల్ల కాలేయం సహజంగా శుభ్రపడుతుంది. నిమ్మకాయ నీరే అని చాలా మంది తేలికగా తీసుకుంటారు. కానీ కాలేయాన్ని శుభ్రపరచడంలో ఇది ప్రభావవంతంగా పని చేస్తుంది. అదే విధంగా ఉసిరికాయ జ్యూస్ కూడా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీనిలో విటమిన్ సితో పాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మనకు సహాయపడతాయి.

### కొబ్బరి నీళ్లు..

కొబ్బరి నీరు కూడా కాలేయ ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి. కొబ్బరి నీటిని తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉంటుంది. శరీరానికి కావల్సిన ఎలక్ట్రోలైట్స్, పోషకాలు అందుతాయి. అల్లం శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అల్లం కషాయాన్ని తీసుకోవడం వల్ల వాపు తగ్గి కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీలకర్ర నీరు కూడా కాలేయానికి మేలు చేస్తుంది. జీలకర్ర నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. తద్వారా కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. కాలేయంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ కూడా సమర్ధవంతగా జరుగుతుంది. ఇలాంటి సహజసిద్ధమైన పానీయాలను తీసుకోవడం వల్ల కాలేయం పనితీరు మెరుగుపడడంతో పాటు కాలేయ ఆరోగ్యం కూడా సరిగ్గా ఉంటుంది. ఈ పానీయాలను తాగడం వల్ల మొత్తం శరీరానికి కూడా మేలు కలుగుతుంది.

# బనానా షేక్ లేదా అరటి పండ్లు..

## రెండింటిలో ఏవి ఎక్కువ మేలు చేస్తాయి..?



మన ఆరోగ్యానికి అరటిపండ్లు ఎంతో మేలు చేస్తాయన్న సంగతి మనకు తెలిసిందే. అరటిపండ్లల్లో ఫైబర్ తో పాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు కలుగుతుంది. పేగు ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి సులభంగా జీర్ణమవుతాయి కనుక వీటిని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అల్పాహారంగా, చిరుతిండిగా లేదా జిమ్ చేసిన తరువాత వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే కొంత మంది అరటిపండును నేరుగా తినడానికి ఇష్టపడరు. అరటిపండ్లతో బనానా షేక్ వంటి వాటిని తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. అయితే అరటిపండ్లను నేరుగా తినడం మంచిదా.. స్నాక్స్ రూపంలో తీసుకోవడం మంచిదా.. అన్న సందేహాలు కూడా మనలో చాలా మందికి వస్తూ ఉంటాయి.

### మిల్క్ షేక్ వద్దు..

అరటిపండును ఏ విధంగా తీసుకోవడం మన ఆరోగ్యానికి, జీర్ణవ్యవస్థకు మంచిదో.. నిపుణులు దీని గురించి ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అరటిపండును ఏ రూపంలో తీసుకోవాలో వ్యక్తి శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు అరటిపండును నేరుగా తీసుకోవడం మంచిది. జిమ్ కి వెళ్లే వారు, భారీ వ్యాయామాలు చేసే వారికి క్యాలరీలు ఎక్కువగా అవసరమవుతాయి. కనుక వ్యాయామాలు చేసేవారు అరటిపండును మిల్క్ షేక్ రూపంలో తీసుకోవడం మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆయుర్వేదం ప్రకారం అరటిపండును నమలి తినడం మంచిదని వారు చెబుతున్నారు. అరటిపండును నమలడం వల్ల లాలాజలంలో ఉండే సమ్మేళనాలు సక్రియం చేయబడతాయి. దీంతో జీర్ణక్రియ సులభతరం అవుతుంది.

### జీర్ణ క్రియకు ఆటంకం..

అరటిపండును నమలడం వల్ల దానిలో ఉండే మొత్తం పోషకాలు శరీరానికి చక్కగా అందుతాయి. అరటిపండుతో స్మూతీ, షేక్ వంటివి చేసి తీసుకోవడం వల్ల దానిని నమలాల్సిన అవసరం లేదు. ఇది జీర్ణవ్యవస్థపై అదనపు భారాన్ని కలిగిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆయుర్వేదం ప్రకారం రెండు రెండు వేరువేరు పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల శరీర సహజ సమతుల్యం దెబ్బతింటుంది. అరటిపండును పాలతో కలిపి మిక్స్ చేసి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీంతో కఫం పెరుగుతుంది. ఇది సైనస్, జలుబు, అలర్జీ వంటి వాటికి దారి తీస్తుంది. బనానా షేక్ పొట్టలోకి చేరిన తరువాత అరటిపండులో ఉండే మాలిక్, సిట్రిక్ ఆమ్లాలు పాలతో కలిసి పెరుగుగా మారుతుంది. దీంతో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. బనానా షేక్ జీర్ణం అవ్వడానికి సమయం పట్టడంతో పాటు పోషకాలను కూడా శరీరం సరిగ్గా గ్రహించదు.

కనుక అరటిపండును నేరుగా తీసుకోవడమే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్యాలరీలు ఎక్కువగా కావాల్సిన వారు అరటిపండును తిన్న రెండు గంటల తరువాత పాలు తాగడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు. ఇలా చేయడం వల్ల జీర్ణ సమస్యలు రాకుండా ఉండడంతో పాటు శరీరానికి పోషకాలు కూడా చక్కగా అందుతాయి. పొట్ట సంబంధిత సమస్యలతో బాధపడే వారు బనానా షేక్ ను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.



# ఈ నడక గుండెకు భరోసా

తిండి కలిగితే కండ కలదోయ్ అన్నట్టే, కొవ్వు పెరిగితే.. గుండె జబ్బు కలుగోయ్ అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. గుండె ఆరోగ్యానికీ, శరీరంలో కొవ్వుకీ సంబంధం ఉంది. గుండెలో ఉన్న సమస్యకు, శరీరంలో ఉన్న కొవ్వుకి ఒకటే పరిష్కారం. వ్యాయామం. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు. గుండె ఆరోగ్యాన్ని పెంచుకునే వ్యాయామం చేస్తూ.. కొవ్వుని తగ్గించేలా కొన్ని నియమాలు పాటిస్తే డబుల్ బెనిఫిట్స్ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

అదేమిటంటే... ట్రెడ్ మిల్ మీద కేవలం పరుగే కాక నడకనూ అలవాటు చేసుకోవాలి. రోజువారీగా ట్రెడ్ మిల్ మీద పరుగెత్తే సమయంలో పది నుంచి పన్నెండు శాతం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఈ సమయాన్ని నడకకు కేటాయించాలని చెబుతున్నారు. ఆ నడక కూడా ట్రెడ్ మిల్ మీదే. నడకలోనూ వేగం ఉండాలన్నది నిబంధన. గంటకు రెండు నుంచి మూడు మైళ్ల వేగంతో ట్రెడ్ మిల్ స్పీడ్‌ని సెట్ చేసుకోవాలి.

ఈ వేగంతో 30 నిమిషాల నుంచి 60 నిమిషాల పాటు వాక్ చేయాలి. ఇలా వారంలో మూడుసార్లు చేస్తే శరీరంలోని కొవ్వు నిల్వలు కరిగిపోవడంతోపాటు రక్తంలోని గ్లూకోజ్ అంతా ఖర్చవుతుందట. కొత్తగా కొవ్వు పేరుకునేకి ఆస్కారమూ ఉండదు. సుదీర్ఘమైన స్పీడ్‌వాక్ గుండె వేగాన్ని మెరుగుపరుస్తుంది. రెండు సమస్యలూ ఉన్నట్లయితే.. మీ వ్యక్తిగత ఫిట్‌నెస్ ట్రైనర్ సలహా తీసుకున్న తర్వాతే ట్రెడ్ మిల్ మీద ముందడుగు వేయండి.

# పచ్చసొన వద్దనకండి!




గుడ్డులో పచ్చసొన తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందని, అది గుండెకు ప్రమాదమని భావించి చాలామంది దాన్ని పకన పెడతారు. మరీ ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారు గుడ్డులోని తెల్లసొనను మాత్రమే తిని పచ్చసొనను పారేస్తుంటారు. కానీ పచ్చసొనతో కలిపి తింటేనే గుడ్డు సంపూర్ణ ఆహారం అవుతుందని నిపుణులు చెబుతున్నారు.

కేవలం తెల్లసొన మాత్రమే తినడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎకువ. తెల్లసొన ఒక ఇన్‌ఫ్లమేటరీ ప్రొటీన్. దీనికి శరీరంలో మంటను కలిగించే స్వభావం ఉంటుంది. దీన్ని పచ్చసొనతో కలిపి తిన్నప్పుడు మాత్రమే అది సమతుల్యమైన, సంపూర్ణ ఆహారంగా మారుతుంది. పచ్చసొనలో కొలెస్ట్రాల్ ఉంటుందనే కారణంతో దాన్ని అందరూ విలన్‌గా చూస్తారు. కానీ, వాస్తవానికి గుడ్డులోని మెజారిటీ పోషకాలు అందులోనే ఉంటాయి. తెల్లసొనతో పోలిస్తే పచ్చసొనలో విటమిన్ ఎ, విటమిన్ ఇ, ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. మన శరీరానికి అవసరమైన కొలెస్ట్రాల్‌లో దాదాపు 85 శాతం మన కాలేయమే సొంతంగా తయారు చేస్తుంది. కేవలం 15 శాతం మాత్రమే మనం తినే ఆహారం ద్వారా అందుతుంది.

శరీరం తనంతట తానుగా తయారు చేసుకునేది ఆరోగ్యానికి ఎప్పుడూ హానికరం కాదు. కణాల నిర్మాణం, హార్మోన్ల ఉత్పత్తి, మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి మెరుగుపడటానికి కొలెస్ట్రాల్ ఎంతో కీలకంగా వ్యవహరిస్తుంది. ఆరోగ్యంగా ఉండాలంటే పచ్చసొనను విస్మరించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు బరువు తగ్గాలనుకున్నా, మీ కండరాలు దృఢంగా తయారవ్వాలన్నా గుడ్డును పచ్చసొనతో కలిపి పూర్తిగా తినడమే శ్రేయసరం. మారెట్లో దొరికే కృత్రిమ ప్రొటీన్ల కంటే ప్రకృతి సిద్ధంగా ఉత్పత్తి అయ్యే గుడ్డు ద్వారా లభించే పచ్చసొన ఎంతో మేలు చేస్తుంది.

# కావాల్సినంత క్యాల్షియం

క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుందని చాలామంది పిల్లలకి ఉదయాన్నే పాలు తాగిస్తుంటారు. పిల్లలేకాదు పెద్దవారు కూడా క్యాల్షియం కోసం పాలు తాగుతుంటారు. వయసు పెరిగేకొద్దీ ఎముకల్లో బలం తగ్గుతుంది కాబట్టి వృద్ధులను కూడా పాలు తాగమని చెబుతుంటారు. క్యాల్షియం సప్లిమెంట్స్ కూడా వాడుతుంటారు. పాలతోపాటు ఈ ఆహార పదార్థాలకు మీ డైట్‌లో చోటివ్వండి. కావాల్సినంత క్యాల్షియం లభిస్తుంది.




పాలు తాగకపోతే క్యాల్షియం అందదని చాలామంది అభిప్రాయం. కానీ, అది వాస్తవం కాదు. 100 మి.లీ. ఆవుపాల ద్వారా 120 మి.గ్రా. క్యాల్షియం అందుతుంది. అదే 100 మి.లీ. గేదెపాలు తీసుకుంటే.. 210 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. ఇంతకు రెట్టింపు క్యాల్షియం అందించే పదార్థాలు ఉన్నాయి. అవేంటంటే..

బెస్ట్ సోర్స్: ఉలవల్లో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. 100 గ్రా. ఉలవల ద్వారా దాదాపు 290 మి.గ్రా. క్యాల్షియం అందుతుంది. నాన్ వెజ్, పాలు తీసుకోలేని వారికి ఉలవలతో క్యాల్షియం అవసరాలు తీరిపోతాయి.

ఎముకలు ఉక్కులా: రాగులు కూడా క్యాల్షియం రిచ్ సోర్స్. దాదాపు 100 గ్రా. రాగుల ద్వారా 350 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. రాగి జావ, రాగి ఇడ్లీ, దోశ, రొట్టె ఇలా రకరకాల రూపాల్లో రాగులు టేస్ట్ చేయొచ్చు. వీటి వల్ల ఎముకలు ఉకులా మారతాయి.

అంతకుమించి: 100 గ్రా. తోటకూరలో దాదాపు 400 మి.గ్రా. క్యాల్షియం ఉంటుంది. ఆకుకూరల్లో క్యాల్షియం సమృద్ధిగా అందించేవాటిలో తోటకూర ముందువరుసలో ఉంటుంది.

రుచికి రుచి: 100 గ్రా. మునగాకులో 440 మి.గ్రా. క్యాల్షియం ఉంటుంది. మునగాకు పప్పు, తాలింపు, పొడి ఇలా రకాలుగా తినొచ్చు.

సూపర్‌ఫుడ్: అవిసె ఆకులు కూడా క్యాల్షియాన్ని అందించే సూపర్ ఫుడ్‌గా చెబుతుంటారు. దాదాపు 100 గ్రా. అవిసె ఆకుల్లో 1200 మి.గ్రా. కాల్షియం ఉంటుంది.

ఎలాగైనా తినొచ్చు: 100 గ్రా. నల్లనువ్వుల్లో 1450 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది.

# ఆంధ్రా అభివృద్ధికి సాయం అందించాలి



**న్యూ ఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్దత కల్పించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్య మంత్రి చంద్రబాబు కోరారు. వీటితో పాటు వివిధ అంశాల్లో రాష్ట్రానికి సహ కారం అందించాలని కోరుతూ విజ్ఞాపన పత్రం అందించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి మంగళ వారం కేంద్ర హోం మంత్రి సహా ఏడుగురు కేంద్ర మంత్రులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు వరుస భేటీ లు నిర్వహించారు. హస్తిన పర్యటనలో మంగళ వారం సీఎం చంద్రబాబు బిజీబిజీగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర సాయం, పెండింగ్ నిధులు, ప్రాజెక్టకు సాయం, పోలవరం నిర్మా ణంతోపాటు హైస్పీడ్ కారిడార్లు, మెట్రో నిర్మాణాలు, వ్యవసాయ రంగం, భూసేకరణ, పునరావాసం వంటి కీలక అంశాలపై ఆయా శాఖ కేంద్ర మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు.

### ఏడుగురు మంత్రులతో భేటీ

మంగళవారం ఒక్కరోజు ఏడుగురు కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలను అందించడంతో పాటు వాటి అవసరాన్ని వివరించారు. అమిత్ షాతో సహా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశమైన సీఎం పూర్వోదయ పథకం ద్వారా రాయలసీమను ఉద్యాన హబ్గా మార్చే ప్రణాళికకు నిధులు ఇవ్వాలని కోరారు. అలాగే వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్ర వాటాను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్సింగ్ చౌహన్తో భేటీ అయిన ముఖ్యమంత్రి ఏపీలో మఖానా డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. మఖానా సాగుకు ఏపీలో అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని సీఎం స్పష్టం చేశారు. కొల్లేరు ప్రాంతంలో 50వేల ఎకరాల్లో మఖానా సాగు చేసేందుకు ఆస్కారం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర వ్యవసాయ మంత్రితో సీఎం చర్చించారు. పీఎం ప్రణామ్ పథకం కింద ఏపీలో సామూహిక సహజ వ్యవసాయాన్ని విస్తరించేందుకు నిధులు విడుదల చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రిని కోరారు. ఈ పథకం కింద గత ఏడాది రసాయన ఎరువుల వాడకం తగ్గించిన రాష్ట్రంగా ఏపీకి రూ.216 కోట్ల మేర ప్రోత్సాహకాలను మం జూరు చేయాలని అడిగారు. ఏపీలో కొబ్బరి సాగు చేసేందుకు రూ.200 కోట్ల మేర సాయం అందించాలని కూడా సీఎం కోరారు. కోకోనట్ ప్రాసెసింగ్ పార్కు ఏర్పాటు, కర్ణాటక తరహాలో ఆధునిక టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు అధునాతన పద్దతులపై శిక్షణ, నర్సరీల విస్తరణకు సహకారం అందిం చాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం కింద పెండింగ్ లో ఉన్న రూ.695 కోట్లను విడుదల చేయాలని విజ్ఞాపన పత్రం అందించారు. ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ సిస్టం కింద 2025-26 సీజన్లో తోతాపురి మామిడి రైతులకు కేంద్ర వాటాగా ఇవ్వాల్సిన రూ.100 కోట్లను విడుదల చేయాలని సీఎం కోరారు.

### పోలవరం రెండో దశకు.. రూ.32 వేల కోట్లు సాయం చేయండి

పోలవరం ప్రాజెక్టు రెండో దశలో భాగంగా తదుపరి భూసేకరణ, పునరావాసానికి నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్కు విజ్ఞప్తి చేశారు. దీనికోసం రూ.32 వేల కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. ఏపీలోని వివిధ సాగునీ టి ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సాయం అందించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి స్టాప్ వర్క్ ఆర్డర్ శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువలసామర్థం పెంపు కారణంగా పెరిగిన వ్యయాన్ని రీయింబర్సు చేయాలని విజ్ఞాపన పత్రం అందించారు. గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రతిపాదనలకు ఆమోదం తెలియచేయాలని అభ్యర్థించారు. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసి, సాంకేతిక-ఆర్థిక సాయం



ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదాన్ని పరిష్కరించేలా వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యూడీటీ) తుది నివేదిక గెజెట్లో ప్రచురిం చాలన్నారు. గోదావరి జలాల పంపకంపై ఏపీ-తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతోందని నదీ జలాల పంపకం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్ను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. ఎగువ కృష్ణాపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు కర్ణాటక చేపట్టిన చర్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

### జీరో ల్యాండ్ ఫిల్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించండి

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా వేస్ట్ మేనేజ్మెంట్, జీరో ల్యాండ్ ఫిల్ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టరు వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2,0 కింద రూ. 276 కోట్ల ఖర్చుతో జీరో ల్యాండ్ ఫిల్ స్టేటస్కు కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. కేంద్ర వాటా కింద రూ. 105 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. అనంతరం కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్ డీ కుమారస్వామితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి ప్లాంట్ లాభాల బాట పట్టడంలో అందించిన సహకారానికి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం అందించిన ఆర్థిక సాయం, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు, స్టీల్ ప్లాంట్ కార్మికులు-ఉద్యోగుల పట్టుదల, శ్రమతో ఈ లాభాలు సాధ్యం అయ్యా యని వివరించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ లాభాలు సాధించడంతో పాటు, పూర్తి స్థాయి సామర్థ్యం మేర పనిచేస్తోందని, ఆర్ఐఎన్ఎల్ విష యంలో భవిష్యత్లోనూ ఇలా సహకారాన్ని అందించాలని కోరారు

### సరకు రవాణా కారిడార్లు అవసరం

ఉత్తర- దక్షిణ భారత్ను అనుసంధానిస్తూ ప్రత్యేక సరకు రవాణా కారిడార్లను ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ను ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర- దక్షిణ భారత్ కలిపేలా ఇటార్సీ- విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకారం అందించాలని.. పోర్టులను అనుసం ధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్ పూర్- చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారం భమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే విశాఖలో తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు అయ్యా యని.. జీఎంసహాఇతర అధికారులు విధుల్లో ఉన్నారని తెలియ చేశారు. అలాగే రాయలసీమలోని తాడిపత్రినుంచి ముంబైలోని జేఎన్ పీటీ పోర్టుకు అరటి ఎగుమతులకు వీలుగా 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అభ్యర్థించారు. రాయలసీమ సహా గిరిజన ప్రాంతాలను కనెక్టు చేసేలా వివిధ కొత్త రైల్వేమార్గాల ప్రతిపాదనల్ని ఆమోదిం చాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ-విజయవాడల మధ్య హైస్పీడ్, విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి-చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలని సీఎం కోరారు. హైదరాబాద్- శ్రీశైలం- మార్కాపురం కొత్త రైల్వే లైన్ ద్వారా శ్రీశైల పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీని పెంచాలని.. తిరుపతి మీదుగా విజయవాడ-బెంగుళూరు మధ్య వందేభారత్ సర్వీసును నడపాలని రైల్వే మంత్రికి ఇచ్చిన లేఖలో సీఎం పేర్కొన్నారు. వివిధ ఎక్స్ ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వటంతో పాటు రైలు బోగీ నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు, చేయాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు. చెన్నై-బెంగళూరు హై స్పీడ్ రైల్ కారిడార్లో తిరుపతిని కనెక్ట్ చేసేలా చూడాలని కోరారు.

## శైవాలయాల్లో పెరుగుతున్న రద్దీ

### శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు

### మంత్రులు , అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి :** శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో శివరాత్రి భక్తుల రద్దీ, వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. శివారాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు ఇతర అధికారులతో ఢిల్లీ నుంచి సీఎం సమీక్షించారు. శివరాత్రి నాటికి ఆలయంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత.. ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సీఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా.. సరైన వసతి లభించేలా కార్యచరణ అమలు చేయాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరవ పరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. ÷రిలిజు రోజుకూ దేవాలయాల్లో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. శివరాత్రి పర్వదినం వంటి సందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



మొదటి పేజీ తరువాయి

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11న బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10: 30కి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించనున్నారు. సుమారు గంటసేపు స్పీచ్ ఉండే అవకాశం ఉంది. తరవాత 11: 30 గంటలకి బీఏసీ సమావేశం జరగనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించి ప్రధానంగా చర్చిస్తారు. 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఇక, ఈ నెల 14వ తేదీన 2026-27కి సంబంధించిన బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వరుస సమావేశాలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నిర్వహించే ఆటలు, సంస్కృతిక కార్యక్రమాలపై స్పీకర్ అయ్యన్న సమీక్ష చేశారు. సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, సభ్యుల ప్రశ్నలు, వాటికి సమాధానాలపై సమీక్షించారు. డీజీపీ సహా పోలీస్ ఉన్నతాధికారులతో స్పీకర్ అయ్యన్న కీలక సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలకు కల్పించే భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

## అసెంబ్లీలో ఇక డిజిటల్ హాజరు విధానం

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైకాపా ఎమ్మెల్యేల వరుస గైర్హాజరు నేపథ్యంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకనుంచి డిజిటల్ విధానంలోనే ఎమ్మెల్యేల హాజరు తీసుకోవాలని నిర్ణయించారు. ఇకపోతే అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అధికారులు, పోలీస్ అధికారులతో స్పీకర్ అయ్యన్నయన్నా, డిప్యూటి స్పీకర్ రఘురామరాజులు సమావేశమయ్యారు. కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే సభకు హాజరు కాని సభ్యులు జీతాలు తీసుకోవడం, ఎమ్మెల్యేలుగా కొనసాగడం సబబా? అని వివిధ సందర్భాల్లో స్పీకర్ అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకున్న విచక్షణాధికారాలతో ఎమ్మెల్యేల హాజరుపై కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలకు సంబంధించి ఇప్పటి వరకు వైకాపాకు చెందిన 11 మంది ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగానికి హాజరుకావడం తప్ప.. శాసనసభ సమావేశాల్లో పాల్గొనడం లేదు. వరుసగా 60 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరైతే.. ఆ సభ్యుడిపై అనర్హత వేటు వేయవచ్చని చట్టంలో ఉందని శాసనసభ వ్యవహారాలశాఖ అధికారులు చెబుతున్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో సభకు వచ్చినంత మాత్రాన సమావేశాలకు హాజరైనట్టు పరిగణనలోకి తీసుకోరని తెలుస్తోంది. దీనిపై చర్చ జరుగుతున్న సమయంలో.. గత పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, దొంగ చాటుగా సంతకాలు చేసి వెళ్లిపోకుండా డిజిటల్ హాజరు ప్రవేశ పెట్టాలని స్పీకర్ నిర్ణయించారు. నేటి గవర్నర్ ప్రసంగం అసెంబ్లీ సమావేశాల్లో కౌంట్ కాదనేది ప్రభుత్వ వర్గాల వాదన. గవర్నర్ ప్రసంగం తర్వాత జరిగే బీఏసీ సమావేశంలో సభ ఎన్నిరోజులు నిర్వహించాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. వైకాపాకు చెందిన ఎమ్మెల్యేలు ఇప్పటి వరకు బీఏసీ సమావేశానికి హాజరైన సందర్భాలు లేవు. ఈ క్రమంలో ఇకపై అసెంబ్లీకి హాజరైన ఎమ్మెల్యేలు హాజరు డిజిటల్ పద్ధతిలో నమోదు చేయాలని అసెంబ్లీ అధికారులకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆదేశాలు ఇచ్చారు.. దీంతో, ఇకపై రిజిస్టర్ లో హాజరు పద్ధతి ఉండదని.. ఎమ్మెల్యేలకు బులిటెన్ విడుదల చేశారు అసెంబ్లీ సెక్రెటరీ జనరల్ ప్రసన్న కుమార్. అయితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సభకు రాకుండానే హాజరు పట్టికలో సంతకం చేస్తున్నారని ఇప్పటికే విమర్శలు వస్తున్నాయి.. వైసీపీ ఎమ్మెల్యేలు కొందరు అసెంబ్లీ లోపలికి రాకుండా సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారనే చర్చ జరుగుతోంది. ఇలాంటి సమయంలో డిజిటల్ అటెండెన్స్ పై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది.. బుధవారం వైఎస్ జగన్ కూడా అసెంబ్లీకి హాజరవుతారని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఇప్పటికే క్లారిటీ ఇచ్చిన విషయం విదితమే.. ఇదిలావుంటే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నందున గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని లోక్ భవన్లో గవర్నర్ను కలిసి అసెంబ్లీ సమావేశాలకు ఆహ్వానించారు. సమావేశాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆయనకు వివరించారు. బుధవారం ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు.

## తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం

### సిట్ విచారణతో రంగంలోకి దిగిన ఈడీ

**తిరుమల :** శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీ ఆర్థిక అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగినట్లు సిట్ విచారణలో తేలడంతో పీఎంఎల్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో వందలాది కోట్లు చేతులు మారడంపై ఈడీ విచారణ జరపనుంది. అలాగే, మనీ ట్రయల్పైనా ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారించనున్నారు. కాగా, 2019 నుంచి 2024 వరకు టీటీడీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేల్చింది. ఈ నెయ్యి విలువ సుమారు రూ. 235 కోట్లుగా అంచనా. నెయ్యి కల్తీ వ్యవహారంలో విచారణ ముగించిన సిట్.. ఛార్జ్షీట్లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వారిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు ఉన్నారు. టెండర్లలో అక్రమాలు, హవాలా మార్గాల ద్వారా లంచాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపుపై ఈడీ విచారణ చేపట్టనుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి ఈడీ.. త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించనున్నట్లు సమాచారం.

## మరో ఇద్దరు చిన్నారుకలు పవన్ అండ

### వారి బాధ్యతలను తీసుకుంటున్నట్లు ప్రకటన

**అమరావతి :** ఆంధప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. మరో ఇద్దరు అనాథ చిన్నారులకు ఆసరగా నిలిచారు.. పిఠాపురం నియోజకవర్గం ప్రజలందరినీ తన సొంత కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్న పవన్ కల్యాణ్.. ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా.. అది చిన్నదయినా.. పెద్దదయినా.. తక్షణం స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గవ్యాప్తంగా 42 మంది అనాథ చిన్నారులకు తన జీతం మొత్తాన్ని ఆర్థిక సాయం రూపంలో అందిస్తున్న ఆయన.. తాజాగా మరో ఇద్దరు చిన్నారుల బాధ్యతను స్వీకరించారు. పిఠాపురం మండలం మాధవపురం గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు రెండేళ్ల క్రితం తండ్రిని, ఇటీవల తల్లిని కోల్పోయారు. ఉండటానికి ఇల్లు కూడా లేక ఇబ్బందిపడుతున్న వారి దుస్థితిని పవన్ కల్యాణ్కు వివరిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా ఓ వీడియో సందేశం పంపారు. ఆ చిన్నారుల వేదన పవన్ కల్యాణ్ని కదిలించింది.

# ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలి

### కాకినాడ కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా

**కాకినాడ :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న ఏడు వేల కోట్ల రూపాయలు బకాయి ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులను విడుదల కోసం విద్యార్థులు జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలి వచ్చి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్ లోవరాజు, ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ ?. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేస్తామని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మరిచిందన్నారు. 7 వేల కోట్లు రూపాయలు ప్రభుత్వం బకాయిలు పెట్టిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని, పరీక్షలకు అనుమతించబోమని విద్యార్థులను బెదిరించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తుందని వారు ఆరోపించారు. రేపు జరగబోయే బ్జడెట్ సమావేశాలలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ అంశంపై చర్చించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాలలు విద్యార్థులలే ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు చెల్లించాలని లేకపోతే పరీక్షలకు అనుమతి ఇవ్వబోమని అంటున్నారన్నారు. చిన్న చిన్న బ్జడెట్ కళాశాలలు కూడా నిర్వహణ అగమ్యగోచరంగా ఉంటుందన్నారు. తక్షణమే ప్రభుత్వ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులందరినీ ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాడతామన్నారు.


అనంతరం సమ్యసలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి కి ఎస్ ఎఫ్ ఐ బఅందం ఇవ్వడం జరిగింది. దీనిపై కలెక్టర్ షాన్ మోహన్ స్పందించి ప్రభుత్వానికీ తెలియజేస్తామని అన్నారన్నారు. జిల్లాలో ఏ కళాశాల కూడా విద్యార్థుల హాలు టికెట్లు, సర్టిఫికెట్లు అంపకుండా చూస్తామన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా, నగర నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్జున్ టెండూల్కర్ వివాహం

**కుటుంబంతో కలసి ప్రధానిని ఆహ్వానించిన సచిన్**

**రాష్ట్రపతి, రాహుల్, అమిత్ షాలకు కూడా ఆహ్వానం**







క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ పెళ్లికి కుటుంబంతో కలసి ప్రధానిని కలసి ఆహ్వానం అందించారు. తన స్నేహితురాలు సానియా చందోక్‌ను అతడు వివాహం చేసుకోబోతున్నాడు. మార్చి 5న ముంబైలో వీరి పెళ్లి జరగనుంది. ఈ నేపథ్యంలో సచిన్ తన కుటుంబంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మంగళవారం కలిశారు. అర్జున్ టెండూల్కర్- సానియా చందోక్ వివాహానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలను సచిన్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, హోంమంత్రి అమిత్ షా, విపక్ష నేత రాహుల్‌ను కూడా కలసి ఆహ్వానాలను అందచేశారు.

ఈ భేటీలో అర్జున్‌తో పాటు సచిన్ భార్య అంజలి, కుమార్తె సారా కూడా పాల్గొన్నారు. ముంబైకి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలే సానియా. ఆమె కూడా వ్యాపారవేత్తే. ముంబైలో మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నడుపుతోంది. చాలా ఏళ్ల నుంచి సచిన్ కుమార్తె సారాతో సానియాకు అనుబంధం ఉంది. దేశవాళీ క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తున్న అర్జున్ టెండూల్కర్ ఇటీవల ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ నుంచి లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ ద్వారా మారిన సంగతి తెలిసిందే. గోవా తరఫున ఆడుతున్న అర్జున్ ఫాస్ట్ బౌలర్‌గా, లోయర్ ఆర్డర్ బ్యాటర్‌గా రాణిస్తున్నాడు. 2022లో రంజీ ట్రోఫీలో గోవా తరఫున అరంగేట్రంలోనే శతకం బాదడం విశేషం. తొలి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లోనే సెంచరీ సాధించిన తన తండ్రి సచిన్ ఘనతను అర్జున్ తిరగరాశాడు.

# రోహిత్, కోహ్లీలకు భారీ షాక్ ఇచ్చిన బీసీసీఐ




భారత క్రికెట్ నియంత్రణ మండలి 2025-26 సీజన్‌కు (అక్టోబర్ 1, 2025 నుండి సెప్టెంబర్ 30, 2026 వరకు) సంబంధించి టీమిండియా సీనియర్ పురుషులు, మహిళా క్రికెటర్ల వార్షిక కాంట్రాక్టులను సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈసారి బోర్డు తన కాంట్రాక్ట్ విధానంలో అనూహ్య మార్పులు చేస్తూ సీనియర్ ఆటగాళ్లకు షాక్ ఇచ్చింది. ఈ ఏడాది బీసీసీఐ తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం 'గ్రేడ్ ఏం' ) కేటగిరీని పూర్తిగా తొలగించడం. గత సీజన్ వరకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజాలు ఈ టాప్ గ్రేడ్‌లో ఉండేవారు. అయితే, తాజా జాబితాలో దిగ్గజ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను గ్రేడ్-బి కి తగ్గించారు. కారణం ఇదే: రోహిత్, కోహ్లీలు ఇప్పటికే టీ20 ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి, ప్రస్తుతం కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. మూడు ఫార్మాట్లలో ఆడే ప్లేయర్లకు మాత్రమే అత్యున్నత గ్రేడ్ ఇవ్వాలనే నిబంధనతో ఈ మార్పు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత కాంట్రాక్టుల్లో గ్రేడ్-ఏ అత్యున్నత కేటగిరీగా ఉంది. ఇందులో కేవలం ముగ్గురు ఆటగాళ్లకు మాత్రమే చోటు దక్కింది. టెస్టులు మరియు వన్డేలకు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ బాధ్యతలు చేపట్టిన గిల్, గ్రేడ్-బి నుండి గ్రేడ్-ఏకి ప్రమోషన్ పొందాడు. జస్ప్రీత్ బుమ్రా: స్టార్ పేసర్ బుమ్రా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. రవీంద్ర జడేజా: సీనియర్ జడేజా కూడా గ్రేడ్-ఏలోనే కొనసాగుతున్నారు.

## గ్రేడ్ల వారీగా ఆటగాళ్ల జాబితా:

గ్రేడ్-బి: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్, కుల్దీప్ యాదవ్, యశస్వి జైస్వాల్, మహ్మద్ సిరాజ్, శ్రేయస్ అయ్యర్.

గ్రేడ్-సి: తెలుగు ఆటగాళ్లు తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డితో పాటు అక్షర్ పటేల్, సంజు శాంసన్, రింకూ సింగ్, శివమ్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, అభిషేక్ శర్మ వంటి 16 మందికి చోటు దక్కింది. వెటరన్ పేసర్ మహ్మద్ షమీకి ఈసారి వార్షిక కాంట్రాక్టులో చోటు దక్కలేదు. మహిళా విభాగంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, దీప్తి శర్మ గ్రేడ్-ఏలో కొనసాగగా, అద్భుత ప్రదర్శన చేసిన జెమీమా రోడ్రిగ్స్ గ్రేడ్-బి నుండి గ్రేడ్-ఏకి ప్రమోషన్ పొందింది. గతేడాది 34 మందికి కాంట్రాక్టులు ఉండగా, ఈసారి ఆ సంఖ్యను 30 మందికి తగ్గించింది.

# పాక్ యూటర్న్..

**భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు అంగీకారం**

## ఫిబ్రవరి 15న భారత్, పాకిస్తాన్ జట్ల పోరు!




తప్పని పరిస్థితుల్లో పాకిస్తాన్ తోక ముడిచింది. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా చివరికి తన నిర్ణయం మార్చుకోవలసి వచ్చింది. పాకిస్తాన్ ప్రభుత్వం తమ జట్టు టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడదని ఫిబ్రవరి 1న ప్రకటించింది. కొన్ని రోజుల హైడ్రామా తర్వాత, పాకిస్తాన్ జట్టు టీమిండియాతో మ్యాచ్ ఆడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదట పాక్ కి 3 కండీషన్లు పెట్టింది. అయితే ICC వాటిని అంగీకరించలేదు. దాంతో చివరికి పాకిస్తాన్ ప్రభుత్వం, పీసీబీ దిగి రావాల్సి వచ్చింది. ఇప్పుడు భారత్, పాకిస్తాన్ మ్యాచ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ప్రేమికులు ఎదురుచూస్తున్నారు. టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా భారత్, పాకిస్తాన్ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ ఆసియా జట్లు గ్రూప్-ఎలో ఉన్నాయి. భారత్ తన మొదటి మ్యాచ్‌లో అమెరికా (యూఎస్‌ఏ)ని ఓడించగా, నెదర్లాండ్స్‌తో జరిగిన తన మొదటి మ్యాచ్‌లో పాకిస్తాన్ విజయం సాధించింది. పాకిస్తాన్ నెక్స్ట్ మ్యాచ్ అమెరికాతో తలపడనుంది. భారత్ గురువారం నాడు తమ రెండో మ్యాచ్ నమీబియాతో ఆడనుంది. తమ మూడవ మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు ఢీకొంటాయి. మైదానం బయట మాటల తూటాలు పేల్చుతున్న పాక్ జట్టు మ్యాచులో ఏం చేస్తుంది, ఎలాంటి ప్రదర్శన చేస్తుంది అనేది ఆసక్తికరంగా మారింది. టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్, పాకిస్తాన్ జట్ల పోరు 27వ మ్యాచ్ అవుతుంది. ఈ మ్యాచ్ ఆదివారం (ఫిబ్రవరి 15న) ఐసీసీ షెడ్యూల్ చేసింది.భారత్, పాక్ మధ్య మ్యాచ్ తటస్థ వేదికలో జరుగుతుంది. గత కొన్నేళ్లుగా పాక్ లో మ్యాచులు ఆడటం లేదు. అయితే ఐసీసీ ఈవెంట్లలో మాత్రం ICC ఈవెంట్స్‌లో భారత్ లో మ్యాచ్‌లు నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ తరువాత పాక్ జట్టు భారత్ రావడానికి నిరాకరిస్తోంది. భారత్ సైతం పాక్ తో స్వదేశంలో మ్యాచులకు సిద్ధంగా లేదు. టీ20 వరల్డ్ కప్ లో ఈ జట్లు తటస్థ వేదిక అయిన కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరుగుతుంది. ఈసారి పొట్టి ప్రపంచ కప్‌ను భారత్, శ్రీలంక జట్లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఫిబ్రవరి 15న టీ20 ప్రపంచ కప్‌లో మొత్తం 3 మ్యాచ్‌లు ఉన్నాయి. టీమిండియా, పాకిస్తాన్ మ్యాచ్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. టాస్ 6:30 గంటలకు వేస్తారు. భారత్, పాక్ మ్యాచ్ కనుక వీకెండ్ అందులోనూ ఆదివారం వచ్చేలా ఐసీసీ షెడ్యూల్ చేసింది. ఈ మ్యాచ్ బ్రేక్ 10 సెకన్ల యాడ్ సైతం ఐసీసీకి కోట్లలో ఆదాయం సమకూరుస్తుంది. భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. జియోహాట్‌స్టార్ యాప్, వెబ్‌సైట్‌లో భారత్, పాకిస్తాన్ టీ20 ప్రపంచ కప్ మ్యాచ్ లైవ్ ఇస్తారు. రాత్రి 7 గంటలకు ఈ ఉత్కంఠభరిత పోరు ప్రారంభం కానుంది.

# నమీబియాపై 7 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్ విజయం

టీ20 వరల్డ్‌కప్‌లో నెదర్లాండ్స్ బోణీ కొట్టింది. దిల్లీ వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో నెగ్గింది. నమీబియా నిర్దేశించిన 157 పరుగుల లక్ష్యాన్ని నెదర్లాండ్స్ 3 వికెట్లు కోల్పోయి 18 ఓవర్లలోనే ఛేదించింది. నెదర్లాండ్స్ బ్యాటర్లలో బాస్ డి లీడే (72 పరుగులు, 48 బంతుల్లో) హాఫ్ సెంచరీతో అదరగొట్టగా, కొలిన్ (32 పరుగులు), మైకెల్ లెవిట్ (28 పరుగులు) రాణించారు. నమీబియా బౌలర్లలో బెర్నాండ్, రుబెన్, జాన్ నికోల్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. ఆల్?రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన నెదర్లాండ్ ప్లేయర్ బాస్ డి లీడేకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 156 పరుగులు చేసింది. జాన్ నికొల్ (42 పరుగులు) టాప్ స్కోరర్. జాన్ ఫ్రైలింక్ (30 పరుగులు), జేజే స్మిత్ (22 పరుగులు) రాణించారు. కెప్టెన్ ఎరాస్మస్ (18 పరుగులు, 9 బంతుల్లో) వేగంగా ఆడే క్రమంలో ఔటయ్యాడు. మిగిలిన బ్యాటర్లు స్టీన్?కాంప్ (6 పరుగులు), జేనె గ్రీన్ (9 పరుగులు), రుబెన్ (9 పరుగులు), లీచర్ (6 పరుగులు), విల్లెమ్ (4 పరుగులు) విఫలమయ్యారు. నెదర్లాండ్స్ బౌలర్లలో వాన్ బీక్, బాస్ డి లీడ్ చెరో 2, క్లాసిన్, ఆర్యన్ దత్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు.టీ20 వరల్డ్?కప్?లో నెదర్లాండ్స్?కు ఇది 11వ విజయం. అసోసియేటెడ్ (టెస్టు హోదా లేని జట్లు) జట్లలో అత్యధిక విజయాలు సాధించిన జట్టుగా నెదర్లాండ్స్ అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. ఈ లిస్ట్?లో నెదర్లాండ్స్? తర్వాత స్థానంలో స్కాట్లాండ్ ఉంది. ఆ జట్టు 8 విజయాలతో రెండో ప్లేస్‌లో కొనసాగుతోంది.కాగా, ఈ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో నెదర్లాండ్స్ తొలి మ్యాచ్‌లో విజయం అంచల దాకా వెళ్లింది. కొలంబో వేదికగా ఈ నెల 07న పాకిస్థాన్ ఢీ కొట్టిన నెదర్లాండ్స్ దాదాపు ఆ జట్టును ఓడించినంత పని చేసింది. ఆ మ్యాచ్?లో తొలుత బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ 19.5 ఓవర్లలో 147 ఆలౌట్ అయ్యింది. అయితే అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మంచి బౌలింగ్‌తో పాకిస్థాన్‌ను నిలువరించింది. 24 బంతుల్లో 34 పరుగులు చేయాల్సిన దశలో సులువుగా పాక్ విజయం సాధిస్తుందని భావించారు. కానీ 17వ ఓవర్లో 1 పరుగే ఇచ్చి 1 వికెట్ తీశాడు లోగన్. దీంతో సమీకరణం 18 బంతుల్లో 33 పరుగులుగా మారింది. 18వ ఓవర్లోనూ 4 పరుగులే రావడంతో చివరి రెండు ఓవర్లలో పాక్ విజయానికి 29 పరుగులు అవసరం అయ్యాయి. దీంతో నెదర్లాండ్స్ సంచలనం చేయడం పక్కా అని భావించారు. కానీ, 19వ ఓవర్లో ఫహీమ్ అష్రఫ్ 3 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 24 పరుగులు బాది మ్యాచ్‌ను తమవైపునకు తిప్పుకున్నాడు. ఆఖరి ఓవర్లో తొలి బంతికి సింగిల్, మూడో బంతికి ఫోర్ రావడంతో పాక్ నెగ్గింది. అలా గెలుపు అంచులదాకా వెళ్లిన నెదర్లాండ్స్ త్రుటిలో మిస్ చేసుకుంది. కానీ తాజా మ్యాచ్?లో ఎలాంటి పొరపాట్లు చేయకుండా చివరి దాకా కసిగా ఆడి విజయం సాధించింది. ఇక ఈ టోర్నిలో నెదర్లాండ్స్ తమ తదుపరి మ్యాచ్ ఈనెల 13న యూఎస్ఏతో తలపడాల్సి ఉంది.

# యూఏఈపై 10 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ విజయం

టీ20 ప్రపంచకప్ 2026లో న్యూజిలాండ్ జట్టు మరోసారి తన ఆటతీరుతో అదరగొట్టింది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో కివీస్ ఓపెనర్లు టిమ్ సిఫర్ట్, ఫిన్ అలెన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగి జట్టుకు 10 వికెట్ల భారీ విజయాన్ని అందించారు. చెన్నైలోని చెపాక్ మైదానం వేదికగా మంగళవారం జరిగిన ఈ పోరులో న్యూజిలాండ్ ఏకపక్షంగా ఆధిపత్యం చాటింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. ఓపెనర్లు మహమ్మద్ వసీమ్, అలీషాన్ షరాఫు జట్టుకు మంచి ఆరంభం ఇచ్చారు. కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించిన ఆ జోడీ పవర్‌ప్లేలోనే బౌండరీలు రాబట్టింది. ముఖ్యంగా వసీమ్ దూకుడుగా ఆడుతూ బౌలర్లపై ఒత్తిడి తెచ్చాడు. వసీమ్ 45 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో అజేయంగా 66 పరుగులు చేశాడు. షరాఫు 47 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 55 పరుగులు సాధించి అర్ధ శతకం పూర్తి చేశాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో యూఏఈ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. మధ్యలో కొన్ని వికెట్లు కోల్పోయినా చివరి ఓవర్లలో వేగంగా పరుగులు జోడించి 173 పరుగుల లక్ష్యాన్ని నిలబెట్టగలిగింది. 174 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఓపెనర్లు మాత్రం ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వలేదు. టిమ్ సిఫర్ట్, ఫిన్ అలెన్ ఇద్దరూ ఆరంభం నుంచే దాడి ధోరణి ప్రదర్శించారు. ఫోర్లు, సిక్సర్లతో బౌండరీల వర్షం కురిపిస్తూ స్కోరు బోర్డును వేగంగా నడిపించారు. సిఫర్ట్ కేవలం 42 బంతుల్లోనే 12 ఫోర్లు, 3 సిక్సర్లతో 89 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరోవైపు అలెన్ 50 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 84 పరుగులు సాధించాడు. ఇద్దరూ పోటీగా ఆడుతూ యూఏఈ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చాటారు. సిఫర్ట్ 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేయగా, అలెన్ 27 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. వీరిద్దరి మధ్య 175 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొంది. ఇది టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఏ వికెట్‌కైనా నమోదైన అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం. ఈ రికార్డు స్టాండ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశారు. కేవలం 15.2 ఓవర్లలోనే ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించి న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది.వ యూఏఈ బౌలర్లలో లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ హైదర్ అలీ తప్ప మరెవరూ ప్రభావం చూపలేకపోయారు. ఎక్కువగా లెంగ్త్ బాల్స్ వేయడంతో కివీస్ బ్యాటర్లు వాటిని సులభంగా బౌండరీలకు తరలించారు. అలెన్ తన ఇన్నింగ్స్‌లో టీ20 అంతర్జాతీయాల్లో 100 సిక్సర్ల మైలురాయిని కూడా అందుకోవడం మరో ప్రత్యేకత. ఈ విజయంతో న్యూజిలాండ్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచి పాయింట్ల టేబుల్?లో తన స్థానం బలోపేతం చేసుకుంది. గత ఎడిషన్‌లో నిరాశపరిచిన కివీస్ ఈసారి మాత్రం గట్టి హెచ్చరికలు పంపుతున్నట్టు కనిపిస్తోంది. మరోవైపు టోర్నీలో ఇదే తొలి మ్యాచ్ ఆడిన యూఏఈకి ఇది కఠినమైన పాఠమైంది. తదుపరి మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన ఇవ్వాలంటే బౌలింగ్‌లో మార్పులు అవసరమని స్పష్టమైంది. మొత్తంగా చూస్తే, చెన్నైలో అభిమానులు న్యూజిలాండ్ ఓపెనర్ల సుడిగాలి ఇన్నింగ్స్‌ను ఆస్వాదించారు. సిఫర్ట్-- అలెన్ జోడీ సృష్టించిన రికార్డు భాగస్వామ్యం ఈ మ్యాచ్‌ను చిరస్మరణీయంగా మార్చింది. టీ20 ప్రపంచకప్‌లో కివీస్ టైటిల్ రేసులో బలమైన పోటీదారులని ఈ విజయం మరోసారి చాటిచెప్పింది.

# విశ్వంభరకు ప్రత్యేకంగా టైటిల్ కార్డ్స్



మెగాస్టార్ చిరంజీవి, వశిష్ట కాంబినేషన్‌లో రాబోతున్న సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టైటిల్ కార్డ్స్ విషయంలో దర్శకుడు వశిష్ట తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'లియో' సినిమా తర్వాత యానిమేటెడ్ టైటిల్ కార్డ్స్ వేయడం అనేది ఒక ట్రెండ్‌గా మారిపోయిందన్న సంగతి తెలిసిందే, అయి-ంతే తన సినిమా కోసం ఆ రొటీన్ ఫార్ములాను ఫాలో అవ్వడం తమకు ఇష్టం లేదని వశిష్ట క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేస్తూ 'విశ్వంభర' కాన్సెప్ట్‌ను ప్రతిబింబించేలా ఏకంగా ఎనిమిది రకాల ప్రత్యేకమైన మెగాస్టార్ టైటిల్ కార్డ్ డిజైన్స్‌ను చిత్ర బృందం రూపొందించినట్లు తెలుస్తుంది. పంచభూతాల నేపథ్యంలో సాగే ఈ ఫాంటసీ అడ్వెంచర్‌లో ప్రతి టైటిల్ కార్డ్ ఒక ప్రత్యేకమైన ఎలిమెంట్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో, చిరంజీవి ఇమేజ్‌ను మరో లెవల్‌లో చూపిస్తూ ఈ కార్డ్స్ డిజైన్ చేయబడ్డాయి. కేవలం టైటిల్ కార్డ్స్ కోసమే దర్శకుడు ఇంతటి కసరత్తు చేశారంటే, వెండితెరపై సినిమా ఏ స్థాయి విజువల్ వండర్‌గా ఉండబోతుం దోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



# లెజెండరీ బయోపిక్‌లో సాయి పల్లవి!

అమరన్, తండేల్ చిత్రాల తరువాత క్రేజీ హీరోయిన్ సాయి పల్లవి సెలెక్షన్ చాలా హైలోకి వెళ్లిపోతోంది. వరుసగా రెండు బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకున్న సాయి పల్లవి ఇప్పుడు అంతకే మించిన స్థాయి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. బాలీవుడ్ డైరెక్టర్ నితేష్ తివారి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న -రామయణ-లో సాయి పల్లవి సీతగా నటిస్తున్న విషయం తెలిసిందే. యావత్ భారతం అమూల్యంగా భావించే రామాయణ ఇతిహాసం నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా రెండు భాగాలుగా రానుంది. ఫస్ట్ పార్ట్ షూటింగ్ పూర్తి చేసుకుని ఈ ఏడాది దీపావళికి భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. వచ్చే ఏడాది దీపావళికి రెండవ భాగం ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనితో పాటు ఆమీర్‌ఖాన్ తనయుడు జునైద్ ఖాన్‌తో కలిసి -ఏక్ దిన్-లో నటిస్తోంది. ఇది మే 1న రిలీజ్ కాబోతోంది. ధనుష్ 55వ ప్రాజెక్ట్‌ని రీసెంట్‌గా ఓకే చేసిన సాయి పల్లవి తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. లెజెండరీ సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్. సుబ్బలక్ష్మి బయోపిక్ లో నటించబోతోంది. భారతీయ శాస్త్రీయ సంగీతానికి వన్నె తెచ్చిన కర్ణాటక సంగత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బలక్ష్మి. భారతదేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి సంగీత కారణిగా ఆమె ప్రత్యేకత చాటుకున్నారు. ఆసియా నోబెల్‌గా భావించే రామన్ మెగసేసే పురస్కారాన్ని సైతం సొంతం చేసుకున్నారు. రచయిత, జర్నలిస్ట్, స్వాంతంత్ర్య సమరయోధుడు త్యాగరాజన్ సదాశివంను ప్రేమ వివాహం చేసుకున్నారు. పదేళ్ల ప్రాయంలోనే సంగీతంపై ఆసక్తి పెంచుకున్న సుబ్బలక్ష్మి చదువుని పక్కన పెట్టి సంగీత ప్రపంచానికే పరిమితమయ్యారు. ఈ భారీ ప్రాజెక్ట్‌ని ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతోంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్‌ని మొదలు పెట్టేశారు. మూవీ ఆఫీస్‌ని అల్లు అర్జున్ ఆఫీస్ సమీపంలో తీసుకున్నారట. గౌతమ్ తిన్ననూరి దీనికి దర్శకుడు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వర్క్ ప్రస్తుతం హైదరాబాద్‌లో రాకెట్ స్పీడుతో జరుగుతున్నట్టుగా తెలిసింది. శాస్త్రీయ సంగీత నేపథ్యంతో గ్లోబల్ ఐకాన్‌గా ఎదిగిన ఎం.ఎస్. సుబ్బలక్ష్మి జీవిత కథ ఎందరికో ఆదర్శం. 2013లో ప్రముఖ కెమెరామెన్ రాజీవ్ మీనన్ ఈ బయోపిక్‌ని తెరపైకి తీసుకురావాలని ప్రయత్నాలు చేశాడు. ఎం.ఎస్. సుబ్బలక్ష్మిగా విద్యాబాలన్‌ని తీసుకోవాలనుకున్నాడు. విద్యాబాలన్‌కు స్టోరీ కూడా వినిపించాడు. తను కూడా ఓకే చెప్పేసింది. కానీ అది ఎందుకో కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత నయనతార, రష్మిక మందన్న, త్రిషల పేర్లు కూడా వినిపించాయి. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై ఎం.ఎస్.సుబ్బలక్ష్మి బయోపిక్‌ని ప్లాన్ చేసిన మేకర్స్ ఫైనల్‌గా సాయి పల్లవిని ఎంపిక చేశారు. ఈ సినిమాలో ఎం.ఎస్. సుబ్బలక్ష్మీ జర్నీని చూపించబోతున్నారు. ఆమె ఎర్లీ లైఫ్, సదాశివంని పెళ్లి చేసుకున్న సందర్భం, గాయనిగా ఎదిగిన క్రమం, నటిగా చేసిన చిత్రాలు వంటి విషయాలు ఇందులో చూపించనున్నారని తెలిసింది.

# జోర్డాన్‌లో డ్రాగన్ యాక్షన్ సీన్స్ షూటింగ్



టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్-డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్' సినిమాపై అభిమానుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ జోర్డాన్‌లో జరుగుతోంది. అక్కడ ఎన్టీఆర్‌పై అత్యంత భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ యాక్షన్ ఎపిసోడ్ పూర్తయిన వెంటనే ఓ స్పెషల్ సాంగ్‌ను షూట్ చేయనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆ పాటలో ఎన్టీఆర్ స్టెప్స్‌తో పాటు హీరోయిన్ రుక్మిణీ వసంత్ గ్లామర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. ప్రశాంత్ నీల్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సాంగ్‌ను కూడా గ్రాండ్ లెవల్‌లో తెరకెక్కించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలిచే అవకాశముంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని యూనిట్ చెబుతోంది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా నిలవాలని ప్రశాంత్ నీల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడని సమాచారం. అందుకే స్క్రిప్ట్ దశలోనే ఆయన చాలా సమయం కేటాయించాడట. కథ, స్క్రీన్‌ప్లే, యాక్షన్ బ్లాక్స్ అన్నింటినీ అత్యంత జాగ్రత్తగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఆయన సంగీతం ఇప్పటికే ప్రశాంత్ నీల్ సినిమాలకు భారీ ప్లస్ పాయింట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనుండటం మరో ప్రత్యేకత. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న 'డ్రాగన్' సినిమాను ఈ ఏడాది జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.



# కొచ్చైడైయాన్ నిర్మాతకు మద్రాస్ హైకోర్టు నోటీసులు

## యాడ్ బ్యూరోకు రెండున్నర కోట్లు చెల్లించాలని ఆదేశం

చెక్ బౌన్స్ కేసులో 'కొచ్చడైయాన్' సినిమా (తెలుగులో 'విక్రమసింహ') నిర్మాతకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. యాడ్ బ్యూరో సంస్థకు నాలుగు వారాల్లో రూ. 2. 5కోట్లు చెల్లించాలని లేదంటే ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. రజనీకాంత్ కథానాయకుడిగా ఆయన కుమార్తె సౌందర్య దర్శకత్వంలో 2014లో వచ్చిన 3డీ మోషన్ క్యాప్చర్ మూవీ 'కొచ్చడైయాన్'. దీపిక పదుకొణె కథానాయిక. ఈ సినిమా నిర్మాణ పనులకు బెంగళూరుకి చెందిన యాడ్ బ్యూరో అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మీడియా వన్ గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ డైరెక్టర్లలో ఒకరైన మురళీమనోహర్ రుణం తీసుకున్నారు. తిరిగి చెల్లింపుల్లో భాగంగా 2014లో మురళీమనోహర్ యాడ్ బ్యూరో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అబిర్ చంద్ నహర్‌కు రూ. 5 కోట్ల చెక్ ఇచ్చారు. అది బౌన్స్ కావడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. మొదట ఈ కేసులో మురళీ మనోహర్‌కు ట్రయల్ కోర్టు ఆరు నెలలు జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆయన మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఇచ్చిన గడువులోపు యాడ్ బ్యూరో అడ్వటంల్గ÷జింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ. 2. 5 కోట్లు చెల్లించాలని లేదంటే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఆదేశించింది.









Edited, Printed, Published and Owned by Y.LINGAIAH. H.No. 2-10-18, Mukarampura,Karimnagar-505001,Telangana and Printed at Rimsha Printers, H.No.5-16/1, Algunur(V),Timmapur (M0,District:Karimnagar and Published at: H.No. 2-10-18, Mukarampura,Karimnagar-505001,Telangana. Editor: Y.LINGAIAH. RNI No. APTEL/2007/20575. Cell 9346927559. Email-chatimpu99@gmail.com.